కొత్తపల్లి

తెలుగు పిల్లల ఈ (e) మాసపత్రిక

జూలై 2011

కొత్తపల్లి తెలుగు పిల్లల ఈ (e) మాసపత్రిక- జులై 2011

మూలం: http://kottapalli.in/2011/07/welcome

సంపాదకులు: నారాయణ

ముఖచిత్రం: అడవి రాముడు

అక్షర కూర్పు: *కొత్తపల్లి*

వెల: రూ. 20/-

ఇంటర్నెట్‌లో ఈ పుస్తకాన్ని వివిధ ఫార్మాటుల్లో ఉచితంగా చదవవచ్చు, డౌన్లోడు చేసుకోవచ్చు, అవసరమనిపిస్తే మీ వాణిజ్యేతర కార్యక్రమాలకోసం మీ అంతట మీరే దీన్ని ముద్రించుకోవచ్చు!

కాపీరైటు: ఈ పుస్తకంలోని ఏ అంశాన్నైనా ఎవరైనా తమ వాణిజ్యేతర కార్యకమాలలో పూర్తిగా ఉచితంగా, స్వేచ్ఛగా ఉపయోగించుకోవచ్చు. కేవలం ఆయా రచయితలకు, కొత్తపల్లి పత్రికకు వాటిని ఆపాదిస్తే సరి. వివరాలకు చూడండి: http://www.creativecommons.org వారి non-commercial, share alike license.

కొత్తపల్లి ప్రచురణలు

యంఆర్‌వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి- 515 101, అనంతపురం జిల్లా.

ఫోను: 08559 240222 ఇ-మెయిలు: team@kottapalli.in

విషయ సూచిక

ముందుమాట

చీమ-గడ్డిచిలక...సంపాదకీయం...2

ధారావాహిక

నీతిచంద్రిక 21...చిన్నయసూరి...5

పిల్లలు రాసిన కథలు

చిట్టిబాబు-బోడిదయ్యాలు...రామ్మోహన్...13

చెట్లునాటుదాం...నిఖిల్...17

రాక్షసుడితో పోరాటం...శివకుమా..20

ప్రేమ...ప్రజ్వల్...22

వంకాయరాజు...పేరురాయనిపాప...24

నిజాయితీ...దిలీప్‌కుమా...26

దేవుడిబహుమతి...హరిత...29

పెద్దలు రాసిన కథలు

అనగనగా..జైసీతారాం...33

వంకాయకిరీటం... చక్రి...35

అనుకరణ...ఆదూరిహైమవతి...38

పిల్లలు-బొమ్మలు...రాధమండువ...43

అనువాద కథలు

శని-శివుడు...పర్తాప్ అగర్వాల్...47

మనఇల్లు...పర్తాప్ అగర్వాల్...51

పాటలు

ఇంద్రధనసు...జగన్‌సంప్రీత్...54

జలజలపారే...జైసీతారాం...56

బుర్‌బుర్‌పాంపాం...జేజిమామయ్య...57

అవీ-ఇవీ

పదరంగం-5...దేవి...58

పొడుపుకథలు...రామచంద్ర...59

బొమ్మకుకథరాయండి!...లలిత...60

చిలిపిప్రశ్నలు...మూర్తి...61

సమీక్ష-కొత్తపల్లి39...మాలతి... 62

చీమ-గడ్డిచిలక

అనగా అనగా ఒక చీమ ఉండేది.

ఎప్పుడూ పనే చేసుకుంటూ ఉండేది అది. ఎండాకాలం అంతా ఆహార సంపాదనలో గడిచిపోయేది. వానాకాలం అంతా అది ఆ ఆహారాన్ని భద్రం చేసుకునేది. ఇక చలికాలం మొత్తం ఆకలిగా తింటూ, నిద్ర మత్తులో ఉండేది. అట్లా అది ఎప్పుడు చూసినా ఏదో ఒక పనిలో మునిగిపోయే ఉండేది. అస్సలు బయటి ప్రపంచాన్నే చూసేది కాదు.

ఒకసారి దానికి ఎవరో చెప్పారు- 'ఈ దేశపు రాజుగారు ప్రతి చలికాలంలోనూ ఒక పోటీ పెడతారు. ఆ పోటీలో గెలవటం అంటే మాటలు కాదు. గెలిస్తే మాత్రం ఇంక మన పంట పండినట్లే: జీవితమంతా సాఫీగా జరిగిపోతుంది. అయితే పోటీలో గెలిచేందుకు చాలా తెలివితేటలు ఉండాలి. ఒక్క తెలివితేటలుంటే చాలదు- చాలా సాధన కూడా అవసరం'.

చీమ వాళ్ళింటికి దగ్గర్లోనే ఒక గడ్డిచిలక (మిడత) ఉండేది. దానికి పాటలంటే చాలా ఇష్టం. వీలు చిక్కిందంటే చాలు, పాడటం మొదలుపెట్టేది. వాన చినుకులన్నా, ప్రొద్దునే చెట్ల ఆకులమీద నిలిచే మంచు బిందువులన్నా దానికి అమితమైన ప్రేమ. కథలంటే- ఇంకేమి, చెవులు కోసుకుంటుంది. ఎన్నెన్ని కథలు చదివిందో లెక్కలేదు. వాళ్ల అమ్మమ్మ దానికి తనెప్పుడో విన్న చీమ-గడ్డిచిలక కథ చెప్పి- "ఒరే, నువ్వు ఏమైనా పాడుకోరా, కానీ చలికాలానికి తిండిని సేకరించి పెట్టుకోవటం మాత్రం మరువకు. మనందరం బద్ధకస్తులమని ఇప్పటికే చెడ్డపేరు వచ్చేసింది. నువ్వే ఆ పేరును తుడిచెయ్యాలి" అంటుండేది.

"నువ్వు చూస్తూండు అవ్వా, రాజుగారు పెట్టే పోటీలో నేను నెగ్గి ఎంత మంచిపేరు సంపాదించి పెడతానో. నాకు మాత్రం లేదా, బాధ్యత!" అంటుండేది గడ్డిచిలక. పోటీకోసమని వాళ్ల నాన్న ఏవేవో పుస్తకాలు తెచ్చిపెడితే, అది వాటినన్నిటినీ త్వరత్వరగా చదివేసి, మళ్ళీ పాటలు, ఆటలు, ఎగరటాలు అన్నీ కొనసాగించేది.

"అప్పుడే చదివేశావా? ఇవేమన్నా కథల పుస్తకాలనుకున్నావా?" అని ఆయన మందలించేవాడు. "నిజం నాన్నా, నాకు వచ్చేసినై, కథల్ని వేగంగా చదివీ చదివీ వేటినైనా వేగంగానే చదువుతున్నాను నేను" అనేది అది.

అంతలో చలికాలం రానే వచ్చింది. రాజుగారు పెట్టే పోటీకి వెళ్ళాయి చీమా, గడ్డిచిలకా రెండూనూ.

చీమ "నేను గెలవాలి-నేను గెలవాలి" అని జపం చేసుకుంటూ, గోళ్ళు కొరుక్కుంటూ, భయం భయంగా నిలబడింది.

గడ్డిచిలక నవ్వుకుంటూ, చిలకపాటలు పాడుకుంటూ కులాసాగా నిలబడింది.

హడావిడిపడి, గందరగోళంపడి పోటీ జరిగే సమయానికి చతికిలబడిపోయింది చీమ.

గడ్డి చిలక ఆడుతూ పాడుతూ పోయి, పోటీలో చక్కగా గెలుచుకొని వచ్చింది.

కాబట్టి, చదువుల్లో హడావిడి, గందరగోళం అవసరం లేదు. ఇష్టంగా, ధైర్యంగా, మెల్లగా, బాధ్యతగా రోజూ చదువుకుంటే చాలు.

ఆటలు ఉంటే చదువులు రావని అనుకోకూడదు. నిజానికి ఆడుతూ పాడుతూ ఉన్న చిలక పిల్లలే బాగా చదువుకునేది.

చదువుల్లోగాని, ఆటపాటల్లోనేగాని- చుట్టూ ఉన్న ప్రపంచాన్ని మరిచిపోకూడదు. మనందరం

కలిసి బ్రతుకుతున్నాం కద, అందుకని ఒకరికొకరం సహాయం చేసుకుంటూ ఉండాలి.

పాత కాలంలో చీమలే గొప్పవని అనుకునేవాళ్ళు. గడ్డిచిలకలే గొప్పవనేది ఇవాల్టి మాట.

ఆడుతూ పాడుతూ చక్కగా చదువుకుందాం.

మనందరికీ దారి చూపుతున్న గడ్డిచిలకలకు అభినందనలతో,

కొత్తపల్లి బృందం.

బాలల రచనలకు ఆహ్వానం!

కథలు ఒకరి సొత్తు కాదు. వాటిని పెద్దవాళ్ళే రాయాలని లేదు. 'చిన్న పిల్లలం కదా, వేరేవాళ్ళు ఎవరో రాసిన కథలు చదువుతాం-అంతే' అనుకోకండి- మీ చిట్టి కలాలకూ పదును పెట్టండి. కొత్తపల్లిలో పెద్దవాళ్ళు రాసిన కథలు ఉంటాయి; అయితే పిల్లలు రాసిన కథల తర్వాతే అవన్నీ!

మీరు రాసిన కథల్ని మాకు రకరకాల మార్గాల ద్వారా పంపించవచ్చు. కథలు రాసిన కాయితాలను మాకు పోస్టు చేయచ్చు; మీకు స్కానర్ అందుబాటులో ఉంటే ఆ కాగితాలని స్కాన్ చేసి పంపచ్చు; ఆ కాగితాలని సెల్‌ఫోనుతో ఫొటో తీసి మాకు మెయిల్ చేసినా చాలు; టైపింగు సాధన కావాలనుకుంటే మీ కథల్ని మీరే టైపు చేసి కూడా పంపచ్చు- ఏదో ఒకలాగ- పంపితే సరి!

మా చిరునామా: కొత్తపల్లి, యంఆర్‌వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా - 515101
ఫోను: 08559 240222 ఇ-మెయిలు: team@kottapalli.in

నీతి చంద్రిక-21

జరిగిన కథ: సింహానికీ ఎద్దుకీ యుద్ధం జరుగుతుంటుంది. ఆ యుద్ధంలో కొంత సేపు ఎద్దుదే పై చేయిగా ఉంటుంది. ఆ సమయంలో ప్రక్కనే కూర్చొని చూస్తున్న నక్క కరటకుడు తన తోటి నక్క అయిన దమనకుడిని విమర్శించటం మొదలుపెడుతుంది.. ఇక చదవండి, నీతిచంద్రిక21 వ భాగం...

మూల రచన: కీ.శే. పరవస్తు చిన్నయ సూరి   *సరళీకరణ: ఘడియారం వేంకట నారాయణ శర్మ*

దమనకుడు నోరు మూసుకొని వింటుంటే కరటకుడు కొనసాగించాడు: " నీకు స్వార్థం ఎక్కువైంది. అందుకే ఇంత చేటు తెచ్చావు. రాజును ఏకాకిని చేశావు. సేవకులను ఎవ్వరినీ ఆయన దగ్గరికి రానియ్యవు. ఎవ్వరినీ దగ్గరికి రానివ్వక, అందరి పనులనూ తన నెత్తినే వేసుకొని తిరిగేవాడు చివరికి రాజుకు కూడా శత్రువౌతాడు.

చెడ్డవాళ్ళకు మంచిచేసినవాడు ఏ విధంగా అయితే కష్టాల పాలౌతాడో, అదే విధంగా మంచి వాళ్ళకు కీడు తలపెట్టిన వాడు కూడా-దాని ఫలాన్ని తప్పక అనుభవిస్తాడు.

సేవకుడు తన యజమాని మేలును కోరుకొని, ఆ మేలు కారణంగా తనూ సంపన్నుడైతే, అలాంటి సంపద ఎన్నటికీ తరగదు. అలాకాక యజమానికి కీడు తలపెట్టి సంపాదించినది ఏదీ నిలిచేది కాదు.

కొందరు సగం పాండిత్యం ఉన్నవాళ్ళు- తెలిసీ తెలియక, తమను తాము పండితులుగా భావించుకొని, ఏది మంచో ఏది చెడో నిర్ణయించి చెప్పేస్తుంటారు- గానీ తమ అజ్ఞానాన్ని మాత్రం గుర్తించరు. తాము చెప్పిన దానికి వ్యతిరేకంగా జరిగినప్పుడు 'దైవం ప్రతికూలించింది' అని సాకులు చెప్పి తప్పించుకో-జూస్తారు.

అట్లాంటి మూర్ఖులకు బుద్ధి చెప్పాలని పోయేవాడు, కోతులకు బుద్ధి చెప్పబోయిన పిట్ట లాగా నష్టపోతాడు. నీకు ఆ కథ చెబుతాను, విను:

కోతులు-పిట్ట

హిమాలయ పర్వతాల ప్రాంతంలో చక్కని అడవి ఒకటి ఉండేది. పళ్లతోటీ, పూలతోటీ ఎప్పటికీ నిండుగా ఉండేది, ఆ అడవి. ఒకసారి, చలికాలం వచ్చింది- వాతావరణం బాగా చల్లగా ఉంది; కోతులన్నిటికీ చాలా చలి పెడుతున్నది. ఆ సమయంలో వాటికి మిణుగురు పురుగుల గుంపు ఒకటి కనబడింది.

కోతులన్నీ వాటిని చూసి, నిప్పు దొరికిందని చాలా సంబరపడ్డాయి- ఆ పురుగులను పట్టుకొచ్చి, వాటి చుట్టూ కట్టెలు పోగుచేసి కప్పి పెట్టి, చుట్టూ కూర్చున్నాయి- చలి కాగేందుకు.

వాటికి దగ్గర్లోనే ఉన్నదొక పిట్ట- దాని పేరు సూచీ ముఖం- అది వాటిని చూసి నవ్వింది: "అయ్యో! వెర్రి కోతులారా! ఇవి నిప్పు కణికలు

కావు- మిణుగురు పురుగులు. కావలిస్తే చూడండి. అదిగో- అక్కడ- ఆ నల్ల చెట్టు దగ్గర నిజం మంట కానవస్తున్నది. అక్కడికి పోయి చలి కాచుకోండి" అన్నది.

పిట్ట మాటలు వినగానే ఆగుంపులోని కోతికొకదానికి విపరీతమైన కోపం వచ్చింది. "నువ్వా, మాకు చెప్పేది?! మేమేం చెయ్యాలో మాకు తెలీదనుకుంటున్నావా?!" అని అది పిట్టను వెక్కిరించింది. అంతలోనే అది గబుక్కున దాని మీదికి దూకి, దాన్ని పట్టుకొని, నేలకు కొట్టి చంపేసింది.

అలాగ, తెలివిలేని మూర్ఖులకు బుద్ధిమంతులు చెప్పే మాటలు నచ్చవు. ఈ ప్రపంచంలో తియ్యగా మాట్లాడేవాళ్ళు చాలామంది కనబడతారు- మేలు కోరి చెప్పేవాళ్ళే అరుదు. అలా మేలు కోరి చెప్పేవాళ్లకంటే అరుదు, ఆ చెప్పింది వినేవాళ్ళు!

తనమేలుని మాత్రం చూసుకుంటూ ఇతరులకు కీడు తలపెట్టేవాడు తప్పక చెడిపోతాడు.

ఇదివరకు నందిగుప్తుడనే వర్తకుడు సుదర్శన గుప్తుడనే వాడిని మోసగించాలని పోయి డబ్బుతోబాటు తన తండ్రినీ కోల్పోయాడు గద! నీకు ఆ కథ చెబుతాను విను" అని ఇట్లా చెప్పసాగింది.

వర్తకులు

జనావతి అనే పట్టణంలో సుదర్శనగుప్తుడు, నందిగుప్తుడు అనే వ్యాపారులిద్దరు ఉండేవాళ్ళు. వాళ్ళిద్దరూ మంచి స్నేహితులు.

ఒకసారి వాళ్ళిద్దరికీ డబ్బు బాగా సంపాదించాలని కోరిక కలిగింది. ఇద్దరూ కలిసి దూర దూరదేశాలు తిరిగి వ్యాపారం చేసారు; కోరినంత డబ్బు సంపాదించారు. ఇక ఇద్దరికీ ఇంటికి తిరిగి వెళ్ళాలనిపించింది.

అలా ఇద్దరూ తిరుగు ప్రయాణం మొదలు పెట్టే ముందు నందిగుప్తుడు సుదర్శన గుప్తుడితో "మిత్రమా, మనం డబ్బు సంపాదించిన సంగతి అందరికీ తెలియటం బాగుండదు. 'ఇదంతా మనం న్యాయంగా సంపాదించిన సొమ్మేకదా, ఎవరికి తెలిస్తే ఏమి?' అనకు.

తేనెటీగలు కష్టపడి సంపాదించిన తేనెను మనుషులు జాలి అనేదే లేకుండా తీసేసుకోవటం లేదా? అందుకని మన ఊరికి దగ్గర్లోనే ఎక్కడైనా మన డబ్బును మొత్తాన్నీ భద్రంగా దాచి పెట్టుకొని పోదాం. మళ్ళీ ఎప్పుడైనా డబ్బు అవసరం పడ్డప్పుడు వచ్చి తీసుకొని పోవచ్చు' అన్నాడు. సుదర్శనగుప్తుడు దానికి ఒప్పుకున్నాడు.



ఇద్దరూ తమ డబ్బునంతా ఒక బిందెలో పెట్టి, ఊరి దరి దాపుల్లోకి చేరగానే అక్కడున్న ఒక మర్రిచెట్టు క్రింద, ఎవ్వరూ చూడకుండా గుట్టుగా దాన్ని పాతిపెట్టి, ప్రశాంతంగా తమ తమ ఇళ్లకు వెళ్ళిపోయారు.

ఇట్లా కొంతకాలం గడిచాక ఒకరోజున నందిగుప్తుడు రహస్యంగా వెళ్ళి, పాతిపెట్టిన ఆ బిందెను త్రవ్వుకొని వచ్చి, వేరేచోట భద్రంగా దాచుకున్నాడు.

ఆ తర్వాత కొంతకాలానికి అతనే సుదర్శన గుప్తుడితో "ఇంక మనం పోయి మన డబ్బును తీసుకొచ్చుకుందాం. ఇప్పుడు ఇక అనుమానించాల్సిన పనిలేదు- మన దగ్గర డబ్బేమీ లేదని అందరికీ నమ్మకంఏర్పడింది. ఇకపైన తెలిసినా, వచ్చే నష్టం ఏమీ ఉండదు. మనరాజు మంచివాడు. మన డబ్బు ఇంక ఎక్కడికీ పోదు. పద" అన్నాడు.

ఇద్దరూ పోయి, గుర్తుల ప్రకారం మర్రిచెట్టు క్రింద త్రవ్వి చూస్తే అక్కడ ఏమీ లేదు!

సుదర్శనగుప్తుడు నిర్ఘాంతపోయి, ఏం చెయ్యాలో తెలీక నిల్చుండిపోయాడు. నందిగుప్తుడు మాత్రం గుండెలు బాదుకుంటూ ఏడ్చి, తన ముందు విచారంగా నిలబడి ఉన్న సుదర్శన గుప్తుడిని చూసి "ఓరోరి మిత్రద్రోహీ! ఎంత పని చేశావురా!? ఎప్పుడో ఒంటరిగా వచ్చి డబ్బునంతా ఎత్తుకొని పోయావు; ఇప్పుడు ఏమీ తెలీనివాడిలా నా

ముందు విచారాన్ని నటించి, మొత్తం సొమ్మును అప్పనంగా మింగేద్దామని చూస్తున్నావే! మనం ఇక్కడ డబ్బుని దాచిన సంగతి మన ఇద్దరికీ తప్ప వేరే వాళ్లెవ్వరికీ తెలియదు గదరా?! అంత డబ్బుకూ కాళ్ళొచ్చి నడచుకొని పోయాయటరా?! కానివ్వురా, నిన్ను ఊరికే వదులుతాననుకోకు. వాళ్లు వీళ్ళలాగా ఈ నందిగుప్తుడు అంత తేలికగా ఓడిపోయేవాడు కాదు. నా సొమ్ము మొత్తాన్నీ నయాపైసలతో సహా నీచేత క్రక్కించకపోతే నా పేరు నందిగుప్తుడే కాదు" అని కోపం నటిస్తూ మీదికి దూకాడు.

సుదర్శనగుప్తుడు కప్పుకున్న అంగవస్త్రాన్ని దొరకపుచ్చుకొని, మరొకచేత్తో అతని పంచెను లాగుతూ "పద, దివాణానికి నడు! అక్కడగానీ నువ్వు దారికి రావు!" అని లాక్కుపోసాగాడు.

సుదర్శన గుప్తుడికి అతని ఈ ప్రవర్తన చాలా ఎబ్బెట్టుగా తోచింది. అతను మిత్రుడికి సర్దిచెబుతూ "ఆగు- ఊరికే ఎందుకు, నేల విడిచి సాము చేస్తావు? కొంచెం ఆగి ప్రశాంతంగా నేను చెప్పేది విను- ఆ తరువాత నీకు తోచినట్లు చెయ్యి. ముందు నన్ను వదులు" అన్నాడు.

నందిగుప్తుడు ఈ మాటలకు మరింత రెచ్చిపోతూ "నాలిక జాగ్రత్తగా పెట్టుకొని మాట్లాడు. నీకు ఓర్పు ఉంటే ఉండచ్చు గానీ, డబ్బంతా పోగొట్టుకున్న నాకు ఇంక ఓర్పు ఎక్కడినుండి వస్తుంది? అబ్బ! ఇంత చాలదన్నట్లు ఇంకా నీ మాటలు కూడా వినాలేం!? ఇక నిన్ను విడిచేది లేదు. రా, దివాణానికి!" అని లాక్కుపోయాడు.

సుదర్శనగుప్తుడు "నువ్వు రమ్మన్నచోటికి వస్తాను. ముందు నా చెయ్యి వదులు" అని బలవంతంగా చెయ్యి విడిపించుకొని అతని

వెంట దివాణానికి పడి పోయాడు.

అక్కడ రాజుగారిముందు నిలబడి నందిగుప్తుడు తను చెప్పదలచుకున్నదంతా ఏకరువు పెట్టాడు. ఆపైన సుదర్శనగుప్తుడు తనవంతుగా "ప్రభూ! అతను చెప్పినట్లు మేం ఇద్దరం డబ్బును దాచిపెట్టుకున్నాం. ఇప్పుడు వచ్చి చూస్తే డబ్బు అక్కడ లేదు. నాకు తెలిసింది ఇంతమాత్రమే- మరే పాపమూ ఎరుగను" అన్నాడు.

రాజుగారు న్యాయాధికారులను రప్పించి వాది-ప్రతివాదులను వాళ్ళకు అప్పగించాడు. "వీళ్ళ తగవును పరిష్కరించండి" అని ఆదేశించారు.

న్యాయాధికారులు వాళ్ళిద్దరి వాదనలనూ విని, నందిగుప్తునితో "అంతా బాగానే ఉన్నది. కానీ నీ ఈ మిత్రుడే డబ్బును త్రవ్వుకొని పోయినట్లు చూసిన సాక్ష్యులు ఉన్నారా, ఎవరైనా ?" అని అడిగారు. "అయ్యలారా! దొంగ అందరికీ తెలిసేట్లు దొంగిలిస్తాడా? మేము డబ్బును పాతిపెట్టిన చోట మర్రి చెట్టు ఒక్కటీ తప్ప, వేరేదేదీ లేదు. అయ్యో! ఇంక నేను సాక్షిని ఎక్కడినుండి తేగలను?" అని ముఖాన్ని దీనంగా పెట్టుకున్నాడు నందిగుప్తుడు.

న్యాయాధికారులు తర్జన భర్జన పడటం చూసి, కొంత సేపయిన తర్వాత అతనే గట్టిగా, అందరికీ వినబడేట్లు "అయ్యా! ఇదిగో, నా ప్రతిజ్ఞను వినండి- నేను నా తల్లిదండ్రుల భక్తుడినే అయితే, కలలోనైనా ఇతరుల వస్తువుల్ని దొంగిలించటానికి ఇష్టపడని సత్యవంతుడినే అయితే, మంచినెంచే స్వభావంగల మీరంతా ఉండగా ఆ మర్రిచెట్టు పలుకుతుంది! స్వయంగా సాక్ష్యం చెప్పి, సత్యం ఏమిటో వివరిస్తుంది!" అన్నాడు ధైర్యంగా.

"ఓహో! ఇతను ఎంతటి మహానుభావుడో

గదా, లేకపోతే ఇంతటి శపథాన్ని సామాన్యులు ఎవరైనా ఎలా చేయగలరు?" అనుకున్నారు అక్కడ చేరినవారిలో కొందరు. కొందరేమో "ఊరికే శపథం చేస్తే ఏమౌతుంది, చివరికంటా ఏం జరుగుతుందో చూడకనే ఇది-అది అని తేల్చలేం. నిజమేదో అబద్ధమేదో దేవునికే ఎరుక" అని, ఇంకొందరు "చూస్తుంటే ఇతనే డబ్బుని దొంగిలించి, తన మిత్రుడిపైన నిందమోపి, తను మాత్రం గొప్ప సత్యశీలుడిగా పేరు పొందాలని ఈ ప్రయత్నంఅంతా చేస్తున్నట్లున్నాడు!" అని అనుకున్నారు.

సభలో తలెత్తిన ఈ కలకలాన్ని విన్న న్యాయాధికారులు ముఖాముఖాలు చూసుకొని- "ఇలాంటి శపథం ఇప్పటి వరకూ ఎవ్వరూ చేసిఉండలేదు" అని ముచ్చటించుకుంటూ, వ్యాపారులిద్దరినీ చూసి "సరే, ఈ రోజు చాలా ప్రొద్దు పోయింది. రేపు ఉదయాన్నే రండి; మీ వివాదాన్ని పరిశీలిస్తాం!" అని సభను మరునాటికి వాయిదా వేశారు. అందరూ ఎవరి ఇళ్ళకు వాళ్ళు వెళ్ళిపోయారు.

ఆరోజు రాత్రి నందిగుప్తుడు తన ఇంటి కిటికీలు, తలుపులు మూసేసి, ఇంటి లోపలి గదిలోకి తన ముసలి తండ్రిని పిలిచి దగ్గర కూర్చోబెట్టుకొని, తను చేసిన దొంగపనితో సహా మొత్తం అతనికి వివరించి "నాన్నా! ఈ లోకంలో ఏది సాధించాలన్నా డబ్బు అవసరం. డబ్బుతో సాధించలేనిదంటూ ఏదీ లేదు. కులం, చదువు, అందం, గుణం- ఏవి లేకపోయినా సరే, ఒక్క డబ్బు ఉంటేచాలు- ప్రజలందరూ వాడిని 'సర్వ గుణ సంపన్నుడు' అని కీర్తిస్తారు.

అన్ని చెడ్డపనులకూ దారిద్ర్యం ఎలా మూలకారణమో, అన్ని తప్పులూ మాఫీ అయ్యేందుకు డబ్బు అంత అవసరం. ఆ

డబ్బును సంపాదించేందుకు చేసే చెడ్డ పనులన్నీ ప్రాయశ్చిత్తం చేసుకుంటే తొలగిపోతాయి- అందుకనే మనిషన్నవాడు 'ఏ విధంగానైనా సరే, డబ్బును సంపాదించాలి' అని పెద్దలు చెబుతారు. ఇదంతా ఆలోచించి చాలా పెద్ద మొత్తాన్ని సంపాదించాను.

చేత చిక్కిన డబ్బును దక్కించుకునే ఉపాయాన్ని దగ్గర పెట్టుకొని, వెర్రిబాగులతనంతో దాన్ని జార విడిచేది ఎందుకు? అందుకని నేను ఒక ఉపాయాన్ని ఆలోచించాను, విను. ఇప్పుడే, ఇంకా తెల్లవారకనే పోయి ఆ మర్రి చెట్టు తొర్రలో వంగి ముడుచుకొని కూర్చో. ఎవ్వరికీ కనబడకు. రేపు తెల్లవారాక, న్యాయాధిపతులు వచ్చి ఆ చెట్టును అడిగినప్పుడు ఏమాత్రం ఆలస్యం చేయకు- "ఇక్కడి డబ్బును సుదర్శనగుప్తుడే దొంగిలించాడు" అని గట్టిగా పలుకు- తొర్రలోంచే, బయటికి రాకు! నేను చెప్పింది చెప్పినట్లు ఇంత మాత్రం పలికావంటే చాలు- మన పక్షం గెలుస్తుంది" అన్నాడు.

అప్పుడు వాళ్ళ నాన్న "ఒరే! ఉపాయాన్ని ఆలోచించినప్పుడు రాగల అపాయాన్ని కూడా ఆలోచించాలి. లేకపోతే పిల్లల్ని కాపాడుకోబోయి ప్రాణాలు పోగొట్టుకున్న కొంగలాగా అవుతావు. నీకు ఆ కథ చెబుతాను విను- అని 'ఉపాయం-అపాయం' కథ చెప్పసాగాడు.

(మిగతాది మళ్ళీ..)

అంతర్దృష్టి! జోకు

టీచర్: హరీ! నీ దగ్గర 20 గేదెలున్నాయనుకో, నేను మరో 20 గేదెలిస్తే ఏమౌతుంది?

హరి: నేను చదువు మానేసి గేదెలు కాయాల్సి వస్తుంది, టీచర్!

సేకరణ: సోమిరెడ్డి

చిట్టిబాబు-బోడి దయ్యాలు

దయ్యాల కథలు- ముఖ్యంగా అల్లరి దయ్యాల కథలంటే పిల్లలకు చాలా ఇష్టం- మాకు కూడానూ. అయితే అసలు నిజంగా దయ్యాలంటూ ఏవీ లేవు కాబోలు- మాకైతే అవి ఎన్నడూ ఎదురు పడలేదు మరి. ఇక రామ్మోహన్‌కిఎప్పుడైనాకనబడ్డాయేమో, తెలీదు..
కథనం: కె.రామ్మోహన్‌రెడ్డి, ఏడవతరగతి, మారుతీపురం, అనంతపురం జిల్లా

అనగా అనగా అమరాపురానికి దగ్గరలో అమరావతి దేవాలయం ఉండేది. ఆ గుడికి వెళ్ళాలంటే ఎవరైనా ఒక అడవిని దాటి వెళ్ళాల్సిందే.

గుడికి వెళ్ళే కాలిబాటకు దగ్గరలోనే ఒక మర్రిచెట్టు ఉండేది. ఆ మర్రి చెట్టులో నివసించేవి, రెండు అల్లరి దయ్యాలు.

వాటి అల్లరికి అంతులేదు: గుడికి వెళ్ళే వాళ్ళని అవి చాలా అల్లరి పెట్టేవి. ఆడవాళ్ళకు జుట్టుకత్తిరించేవి; మగవాళ్ళకు వెంట్రుకలు లేకుండా గుండు చేసేవి. వాళ్ళు కంగారు పడుతుంటే చూసి, వికవికా నవ్వి భయపెట్టేవి.

ఎలాగైనా వాటిని వదిలించుకోవాలని చుట్టు ప్రక్కల గ్రామాల్లో వాళ్లంతా కలిసి రకరకాల మంత్రగాళ్ళను పిలిపించారు. కానీ అవి రెండూ ఎవ్వరికీ చిక్కలేదు. ప్రతివాడూ వాటి అల్లరిని భరించలేక పారిపోయేవాడే.

అమరాపురంలో నివసించే చిట్టిబాబు చాలా తెలివైనవాడు. వాడి తెలివిని చూసి స్నేహితులందరూ "ఒరే! నీ తెలివిని మామీద కాదురా, అమరావతి గుడి దగ్గరున్న దయ్యాలమీద ప్రయోగించి వాటిని వెళ్ళగొట్టు చూద్దాం" అనటం మొదలు పెట్టారు. ఆలోచించగా వాడికి అదీ మంచిదేననిపించింది. ఎలాగైనా ఆ దయ్యాలను రెండింటినీ పారద్రోలి తన తెలివితేటల్ని నిరూపించుకోవాలని నిశ్చయించుకున్నాడు.

వెంటనే ఒక చిన్నపెట్టెని తీసుకుని గుడి దగ్గరికి బయలుదేరాడు చిట్టిబాబు. కాలిబాటన నడుస్తూ "ఇంకా రాలేదే! ఈ తెలివిలేని దయ్యాలు ఇంకా రాలేదే!" అనుకుంటూ పోతున్నాడు. దూరం నుండే వాడిని చూసి దయ్యాలు రెండూ చాలా సంబరపడ్డాయి. మర్రి చెట్టు ఊడల్ని పట్టుకొని ఊగి ఊగి ఉత్సాహంగా కేకలు పెట్టాయి. చిట్టిబాబుకి వాటిని చూస్తే ఏమాత్రం భయం వెయ్యలేదు సరికదా చాలా నవ్వు వచ్చింది. కాలి బాటను వదిలి నేరుగా ఆ దయ్యాలున్న మర్రి చెట్టు దగ్గరికి వెళ్ళాడు.

దయ్యాలు రెండూ మర్రి ఊడల్ని వదిలేసి వాడి దగ్గరికి వచ్చాయి కత్తెరలు, దువ్వెనలు చేతబట్టుకొని. "ఓహో ఓహో! బుజ్జిబాబు వచ్చాడే, గుండు చేయించుకోటానికి! నీకు ఏ రంగు దువ్వెన కావాలి నాన్నా?" అంది ఒక దయ్యం ఇకిలిస్తూ.

"నేను బుజ్జిబాబును కాదు- చిట్టిబాబును!" అన్నాడు చిట్టిబాబు. "అయినా బాగుందే, మీపని! నాకు గుండు ఇష్టం ఉండదమ్మా; చక్కగా క్రాపు చెయ్యండి చాలు" అని నవ్వాడు.

"ఓయ్! ఓయ్! మేం మా స్నేహితులందరికీ గుండే చేస్తాం చిట్టీ! నీకూ అదే ప్రాప్తి"అన్నది రెండో దయ్యం చాకును ఝుళిపిస్తూ.

చిట్టిబాబు "అయ్యయ్యో! చూస్తుంటే నీ తెలివంతా అడుగంటి పోతున్నట్లున్నది. నాకు క్రాపు చేసేందుకు నీకెందుకంత తొందర? శ్శ్..ఆగు నేస్తం! మనం స్నేహితులం. నేను వచ్చిన పని వేరు. ఊరికే గుడికి పోతున్నాననుకున్నారా? కానే కాదు. ముందు నేను మీకు ఒక పోటీ పెడతాను. దానిలో ఎవరు గెలిస్తే వారికి బహుమానం ఇస్తాను" అని చెప్పాడు.

దయ్యాలు రెండింటికీ బహుమానం అనగానే ఆశ పుట్టింది. "ఏంటా పోటీ?" అన్నాయి రెండూ ఒకే గొంతుతో.

ఆ కొండ మీదికి ఒక్క గెంతు గెంతాలి- ఎవరు ముందు గెంతితే వాళ్లకే బహుమతి" అన్నాడు చిట్టి బాబు. దయ్యాలు రెండూ ఒక్క గెంతులో కొండ మీదికి గెంతేసాయి. మరొక్క గెంతులో వెనక్కి వచ్చేశాయి. "మేం ఇద్దరమూ ఒకే సారి గెంతేసాము! ఇద్దరిదీ బహుమతి!" అన్నాయి ఉత్సాహంగా.

"అట్లా కుదరదమ్మా! ఒక్కరికే బహుమతి! ఒకళ్ళే గెలిచేటట్లు వేరే పోటీ ఏదైనా పెట్టాలి మీకు" అన్నాడు చిట్టిబాబు.

"తొందరగా పెట్టెయ్! తొందరగా పోటీ పెట్టెయ్!" అన్నాయి దయ్యాలు రెండూ గబగబా.

చిట్టిబాబు కొంచెం సేపు ఆలోచించినట్లు నటించి "సరే! మీ ఇద్దరిలో ఎవరు ముందుగా ఈ అడవి చివరికంటా వెళ్లొచ్చి నన్ను ముట్టుకుంటారో వాళ్లదే బహుమానం" అన్నాడు.

మరుక్షణం అవి రెండూ మాయమయ్యాయి. ఇంకో క్షణానికల్లా తిరిగి ప్రత్యక్షమయ్యాయి. చిట్టిబాబుని పట్టుకొని "మళ్ళీ ఇద్దరం గెలిచాం! ఇద్దరం ఒకేసారి అడవి చివరికి వెళ్ళొచ్చాం!" అన్నాయి.

"సరే ఆగండి. నేను ఆలోచించాను- ఈసారి పోటీ పెద్దది. మీ ఇద్దరిలో ఎవరో ఒకరు ఓడిపోక తప్పదు" అన్నాడు చిట్టిబాబు . "ఈ పోటీలు బాగున్నాయ్! తొందరగా చెప్పు! ఏమిటా పోటీ, ఈసారి?" అన్నాయి దయ్యాలు కుతూహలంగా.

"మీరు ఇద్దరూ ఈ పెట్టెలోకి పోయి కూర్చోవాలి. బయటికి రాకుండా ఎవరు ఎక్కువ సేపు కూర్చుంటే వాళ్ళది, బహుమానం!" అన్నాడు చిట్టిబాబు. "ఓస్! ఇదీ ఒక పోటీయేనా!?" అని మరుక్షణం దయ్యాలు రెండూ ఒకే సారి పెట్టెలోకి దూరి కూర్చున్నాయి.

చిట్టిబాబు వెంటనే ఆ పెట్టెకు మూత పెట్టి తాళం వేసేశాడు. ఊరి జనాలందరికీ దయ్యాల్ని బంధించిన పెట్టెను చూపించాడు. పెద్ద గొయ్యి తవ్వించి, పెట్టెను అందులో పెట్టి, మన్నుతో కప్పేశాడు.

అయితే ఈ సంగతి ఏమాత్రం తెలీదు దయ్యాలకు. అవి రెండూ పంతం కొద్దీ పెట్టె లోపలే కూర్చొని ఉన్నాయి ఇంకా. ఎవరైనా గొయ్యిని తవ్వి, పెట్టె మూత తెరచినా అవి మాత్రం బయటికి వచ్చేట్లు లేవు. బహుమానం అంటే అంత మోజైంది మరి! ముందు బయటికి వచ్చినవాళ్ళు ఓడిపోతారు గద!

దయ్యాల బెడద వదిలిందని జనాలందరూ సంతోషపడ్డారు. చిట్టిబాబు తెలివికి ఎక్కడలేని పేరూ వచ్చింది. అమరావతి గుడికి వెళ్ళే వాళ్లకు బలవంతపు గుండ్ల మోత తప్పింది!

జోకు

ఎవరు?!

టీచర్: రాముా! దొర భార్యని "దొరసాని" అంటారు. మరి మంత్రి భార్యని?

రాము: మంత్రసాని, టీచర్.

సేకరణ: సుచరిత

చెట్లు నాటుదాం

రచన; ఆర్.నిఖిల్, 6 వ తరగతి, ZPHS, వెంకటంపల్లి, అనంతపురం జిల్లా

వెంకటంపల్లిలో రవి అనే పిల్లవాడు ఉండేవాడు. వాడి స్నేహితులు కొందరు పట్టణంలో చదువుతున్నవాళ్ళు, వేసవి సెలవులలో వెంకటం పల్లికి వచ్చారు . వాళ్ళు రవి వాళ్ళ ఇంటికి ఆడుకోవడానికి వచ్చేసరికి వాడు నర్సరీలో మొక్కలకి నీళ్ళు పడుతున్నాడు.

"ఏమిరా, రవీ! నువ్వేంటీ..ఆడుకోకుండా మొక్కలు పెంచుతున్నావు? వీటిని నేలలో గద, నాటాల్సింది- మరి నువ్వు కవర్లలో పెంచుతున్నావెందుకు?" అడిగారు వాళ్ళు.

"కొన్ని విత్తనాలమీద పెంకు చాలా గట్టిగా ఉంటుంది- చాలా రోజులు వరసగా తేమ తగిలితే తప్ప, అవి మొలకెత్తవు. మరికొన్ని విత్తనాలు చాలా సన్నగా ఉంటాయి కదా, వాటిని వేరేగా నాటటం కష్టం. అలాంటి

మొక్కలన్నిటినీ ఇలా కవర్లలో పెట్టి పెంచుతాం; అవి కొంచెం పెద్దవయ్యేసరికి వానలు పడతాయి- అప్పుడు వాటిని నేలలో ఎక్కడ కావలిస్తే అక్కడ దూరం దూరంగా నాటుకోవచ్చు" వివరించాడు రవి.

"అబ్బ! ఏం తెలివిరా!" మెచ్చుకున్నారు వాళ్ళు.

వాళ్లలో ఒకడికి రవి మట్టి చేతులు నచ్చలేదు. "ఈ చెట్లు ఎందుకు నాటాలిరా, మనకు అంత అవసరమా?" అని అడిగాడు.

రవికి నవ్వు వచ్చింది. "చెట్ల వల్ల చాలా ఉపయోగాలు ఉన్నాయిలేరా, పెద్దయితే తెలుస్తుంది నీకు కూడా. మా బాబాయి కొన్ని రోజుల క్రితం భలే కథ చెప్పాడు ఒకటి. నేను మీకందరికీ ఆ కథ చెబుతాను వినండి- ఒక ఊళ్లో ఒక రాజుగారు ఉన్నారట. ఓసారి ఆ రాజుగారు పొరుగూరికి వెళ్తుంటే బలంగా గాలి మొదలయిందట. అకస్మాత్తుగా ఆయన ముందు రెండు చెట్లు- ఫెళఫెళా విరిగి పడ్డాయి! రాజుగారు ఒక్క అడుగు ముందుకు వేసినా అవి సూటిగా ఆయన మీదికి వచ్చి పడేవి! సమయం బాగుంది- ఆయనకు ఏమీ కాలేదు.

అయితే ఆయనకు చాలా కోపం మాత్రం వచ్చేసింది- తనదారికి చెట్లు అడ్డు పడ్డాయని! వెంటనే ఆజ్ఞలు జారీ చేశారు: "ఇకపైన మన దేశంలో ఒక్క చెట్టుకూడా ఉండకూడదు- నరికేయండి అన్నిటినీ" అని.

ఇంకేముంది? రాజుగారి సైనికులు వచ్చిపడి, ఎక్కడెక్కడో ఉన్న చెట్లనన్నింటిని నరికేశారు. అంతే- మరుసటి సంవత్సరం ఆ రాజ్యంలో భయంకరమైన కరువు మొదలైంది. వానలు లేవు. బావులన్నీ ఎండిపోయాయి. సాగునీరే కాదు- త్రాగేందుకు కూడా నీళ్ళు కరువయ్యాయి. ప్రజలు ఇతర దేశాలకు వలస పోవటం మొదలు పెట్టారు.

ఒక రోజున రాజుగారు మారువేషంలో దేశాటనకు వెళ్ళారు. ఎక్కడ చూసినా ప్రజలు- అందరూ ప్రయాణాల్లో ఉన్నారు! రాజుగారు ఆశ్చర్యపోయారు. వాళ్ళదగ్గరికి వెళ్ళి "బాబూ! ఎక్కడికి వెళ్తున్నారు, మీరంతా?" అని అడిగారు.

"మన రాజుగారు చేసిన తిక్క పని వల్ల ఎక్కడా వానలు లేవు; త్రాగేందుకు నీళ్ళు లేవు; పంటలన్నీ ఎండిపోతున్నాయి. ఇక ఈ రాజ్యంలో ఏమి తిని బ్రతకాలి? అందుకే పొరుగు దేశానికి వలస పోతున్నాం" అని చెప్పారు. ఎక్కడ చూసినా అందరూ రాజు గారిని తిడుతూనే ఉన్నారు.

రాజుగారికి తప్పు తెలిసివచ్చింది. తను తీసుకున్న ఒక్క తప్పుడు నిర్ణయం వల్ల దేశంలోని ఎందరు పౌరుల జీవితాలు ఇక్కట్ల పాలయ్యాయో తెలిశాక ఆయనలో పశ్చాత్తాపం మొదలైంది. పొరుగు దేశంనుంచి చెట్లు తెప్పించి దేశమంతా నాటించాడు. ఆ తర్వాత పదేళ్ళకి, చెట్లన్నీ పెరిగి పెద్దవయ్యాక గానీ ఆ రాజ్యం బాగుపడలేదు"

మా బాబాయి ఈ కథ చెప్పాక నాకు అర్థం అయ్యింది- మనం కూడా చెట్లు నాటాలి- మన వంతుగా కొన్ని. అందుకే నేను నర్సరీ మొదలు పెట్టాను. ప్రతిరోజూ కొన్ని చెట్లను నాటుతున్నాను" అని చెప్పాడు రవి.

"మేము కూడా చెట్లునాటుతాం! మా స్నేహితులతో కూడా చెట్లు నాటిస్తాం!" అన్నారు రవి స్నేహితులు. రెండు రోజులు గడిచే సరికి, ఊళ్ళో ఏ పిల్లను చూసినా, ఏ పిల్లవాడిని చూసినా మొక్కలు పెంచే పనే!

"ఏదో ఉపద్రవం ముంచుకొస్తున్నట్లు, ఇదేంటిరా వీళ్లంతా ఇట్లాగ?" అని పెద్దవాళ్ళు నవ్వుకున్నారు.

కొందరైతే తమ పిల్లల్ని మొక్కలు నాటద్దన్నారు: "మీరు పట్టణంలో చదువుతున్నారు; మీకు ఎందుకు బాబూ, ఈ పనులన్నీ?" అని.

కానీ పిల్లలు మాత్రం "అమ్మా !'పట్టణంలో పిల్లలు చెట్లు నాటకూడదు; పల్లెటూరి పిల్లలే నాటాలి'అని మీకు ఎవరు చెప్పారు? చెట్లని ఎవరైనా నాటవచ్చు. మన పట్నాలలో ఎంత కాలుష్యం ఉంటోందో చూడండి. అక్కడి గాలి బాగుపడాలంటే ఇంకా ఎన్నో చెట్లు అవసరం కదా? మనం కాకపోతే ఇంకెవరు చేస్తారు, ఈ పని?" అన్నారు మరిన్ని ప్యాకెట్లలో మట్టిని నింపుతూ.

రాక్షసుడితో పోరాటం

పిల్లలు రాక్షసుడితో ఇంత సులభంగా పోరాటం చేస్తారు - మన రచయితలూ, కవులూ ఎందుకనోదాన్ని అంత సంక్లిష్టం చేసిపెట్టారు గానీ..

వి. శివకుమార్, 4 వతరగతి, టింబక్టు బడి, అనంతపురం జిల్లా

ఒక రాజుకు ఇద్దరు కవల పిల్లలు ఉండేవారు. ఇద్దరూ ఆడపిల్లలు.

ఒక రోజున గాలి పెద్దగా వచ్చింది. కవల పిల్లలిద్దరూ గాలికి కొట్టుకు పోయారు. రాజు ఎంత వెతికించినా వాళ్ళిద్దరూ ఇంక దొరకనేలేదు.

తర్వాత రాజుకు మళ్ళీ ఒక కొడుకు పుట్టాడు. చాలా విద్యలు నేర్చుకున్నాడు వాడు.

వాడు పెద్దయినాక, ఒక రోజున రాజు వాడికి వాడి అక్కల గురించి చెప్పాడు. అది వింటూనే వాడు తన అక్కలను వెతికేందుకు బయలుదేరాడు.

వెతుకుతూ వెతుకుతూ ఆ రాజకుమారుడు ఒక అడవికి చేరుకున్నాడు. అక్కడ ఒక గుడిసె కనిపించింది. ఆ గుడిసెలోకి వెళ్ళి చూస్తే ఒక ముసలమ్మ కనిపించింది, పొయ్యిలోకి గాలి ఊదుతూ. రాజకుమారుడు వెళ్ళి అవ్వకు పొయ్యివెలిగించి పెట్టాడు.

ముసలమ్మ వాడిని అడిగింది "నువ్వెవరు, ఇక్కడికెందుకొచ్చావు?" అని. వాడు ముసలమ్మకు విషయమంతా చెప్పేశాడు.

"ఓహో వాళ్ళేనా నీ అక్కలు! వాళ్లని ఎత్తుకెళ్ళింది ఒక రాక్షసుడు. సుడిగాలి రూపంలో వచ్చి వాళ్లను ఎత్తుకెళ్లాడు, పెంచుకునేందుకు. ఇట్లే కొంచెం ముందుకి వెళ్ళావంటే వాడి ఇల్లు కనబడుతుంది. నీ తెలివి బాగా ఉపయోగించి నీ అక్కల్ని వెనక్కి తెచ్చుకోపో!" అని ముసలమ్మ యువకుడికి చెప్పింది. అది వింటూనే చాలా ఉషారుగా రాక్షసుడి ఇంటికి నడుచుకుంటూ పోయాడు రాజకుమారుడు.

వీడు వెళ్ళేటప్పటికి రాక్షసుడు తన ఇంటి ముందు కూర్చొని ఉన్నాడు. రాజకుమారుడిని చూసి "నువ్వెవరు రా!" అని గర్జిస్తూ అడిగాడు. రాజకుమారుడు భయపడలేదు. "నేను రాజకుమారుడిని రా!" అని అరిచాడు గట్టిగా.

"నువ్వెందుకొచ్చావిక్కడకి ?"అని ఇంకోసారి గట్టిగా అరిచాడు రాక్షసుడు.

"నా అక్కల కోసం వచ్చానోయ్, నీకేం కష్టం?!" అని రాక్షసుడి మీసం పట్టుకొని గిర గిర తిప్పి విసిరేశాడు రాజకుమారుడు. ఆ దెబ్బకు రాక్షసుడు దూరంగా వెళ్ళి పడ్డాడు.

అప్పుడు రాక్షసుడు గట్టిగా పోరాడటానికి ప్రయత్నించాడు. వాడికి, రాజకుమారుడికి పెద్దగా యుద్ధం జరిగింది. చివరికి రాక్షసుడు కాస్తా చచ్చి పడిపోయాడు.

అప్పుడు రాజకుమారుడు రాక్షసుడి ఇంటిలోపలికి వెళ్ళి చూశాడు. వాళ్ల అక్కలు అక్కడే ఉన్నారు. అక్కలను తీసుకొని రాజ్యానికి వెళ్ళాడు రాజకుమారుడు.

అందరూ చాలా సంతోషపడ్డారు.

ప్రేమ

రచన: కె.ప్రజ్వల్, 10 వతరగతి, గాంధి మెమోరియల్ స్కూల్, జహీరాబాద్.

ఒక ఊరిలో రొట్టెలు చేసుకుని బ్రతికే ముసలమ్మ ఒకామె ఉండేది.

తనవారంటూ ఎవ్వరూ లేని ఆమె, ఒక అనాథ పిల్లవాడిని చేరదీసింది.

ప్రతిరోజూ ముసలమ్మ కట్టెల పొయ్యి మీద రొట్టెలు కాల్చేది. ఎప్పుడు రొట్టెలు కాల్చినా ఆమె చేతులు కాలేవి. అది చూసి ఆ పిల్లవాడికి బాధవేసేది.

ఊళ్ళో ముసలమ్మ పొయ్యి సంత జరిగే మైదానానికి దగ్గరలోనే ఉండేది. వారానికోసారి అక్కడ సంత జరిగినప్పుడు ఆమె రొట్టెలు మరిన్ని అమ్ముడయ్యేవి. ఆ రోజు వచ్చిన లాభాలతో అవ్వ వారమంతా నెగ్గుకొచ్చేది.

సంతలో వచ్చే రకరకాల వస్తువులు అమ్ముడయ్యేవి. సంతకు వచ్చిన పిల్లలందరికీ వాళ్ల తల్లిదండ్రులు ఏదో ఒక వస్తువు-

తినేందుకో, ఆడుకునేందుకో కొనిపెట్టేవాళ్ళు. అలా వాళ్ళు తమకు నచ్చిన సామాన్లు కొనుక్కోవడం చూసినప్పుడు పిల్లవాడు గమ్మున నిలబడి గమనించేవాడు. వాడి కళ్లలోని బాధ, ఒంటరితనం ముసలమ్మను కలచి వేసేవి.

చూసీ చూసీ ఒకరోజున ఆ ముసలమ్మ తను దాచుకున్న పది రూపాయలు ఆ పిల్లవాడికి ఇచ్చి "ఒరే! వీటితో సంతలో నీకు నచ్చినవి ఏమైనా కొనుక్కో" అన్నది. పిల్లవాడు ముందు కొంచెం సంకోచించి, ఆపైన వాటిని అందుకొని ఉత్సాహంగా సంతకు పరుగుతీశాడు. వాడి కళ్లలో మెరుపును చూసి ముసలమ్మకు చాలా సంతోషమైంది.

అలా వెళ్ళిన పిల్లవాడు పది నిముషాలలో తిరిగి వచ్చాడు. వాడి ముఖం వెలిగిపోతున్నది. చేతుల్ని జేబులో పెట్టుకొని "నేను ఏం కొన్నానో కనుక్కో!" అన్నాడు వాడు.

"ఏమి కొనుక్కున్నావు, చూపించు!" అని చూసింది ముసలమ్మ.

పిల్లవాడి చేతిలో ఒక స్టీలు చిమట ఉన్నది.

"ఇది ఎందుకురా?" అడిగింది ముసలమ్మ.

"రోజూ నువ్వు రొట్టెలు చేస్తున్నప్పుడు నీ చేతులు కాలటంలేదా? దీనితో రొట్టెలు కాలిస్తే చేతులు కాలవు!" అన్నాడు పిల్లవాడు.

ఆనందంతో ముసలమ్మ కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

చిలిపి ప్రశ్న-తిక్క జవాబు

నాయకుడు ఎవరు?

ఎన్నికల ముందు దానకర్ణుడు, ఎన్నికల తర్వాత కుంభకర్ణుడు!

సేకరణ: సుచరిత

వంకాయ రాజు

నార్పల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పిల్లలు చాలా కథలు రాసి పంపారు. వాటిలో మాకు చాలా నచ్చింది ఈ కథ- అయితే రాసిచ్చిన వాళ్ళెవరో గాని, పేరు రాయటం మర్చిపోయారు! ఇంకెలాగ? ..ఇలాగ!

రచన: పేరు రాయని పాప, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, నార్పల, అనంతపురం జిల్లా.

ఒక ఊరి గుమ్మడికాయ,టమోట,సొరకాయ, క్యారెట్, వాళ్ళలో ఒకరిని రాజుగా ఎన్నుకోవాలనుకున్నాయి.

ఒకరోజు బాగా గొడవపడ్డాయి.

టమోట "నేను ఎర్రగా బుర్రగా ఉంటాను కదా! అందుకని నేనే రాజును" అనింది.

గుమ్మడికాయ "నేను లావుగా, గుండుగా ఉంటాను, కాబట్టి నేనే రాజును" అని అన్నది.

క్యారెట్టు "నేను బాగా చిన్నగా ఉంటాను, కాబట్టి నేనే రాజును" అన్నది.

సొరకాయేమో "నేను బాగా పచ్చగా

ఉంటాను, కాబట్టి నేనే రాజును" అనింది.

ఒక మూలన కూర్చొని ఉన్న వంకాయ వచ్చి "ఆగండి! నేను రెండు ప్రశ్నలు అడుగుతాను- చెప్పండి!"అన్నది.

అన్నీ గొడవ పడటం మాని వంకాయ వైపు చూశాయి.

వంకాయ అడిగింది-"రాజు తలపైన ఏముంటుంది ?" అని.

"మాకుతెలుసులే, కిరీటం!" అన్నాయి మిగిలినకూరగాయలు.

"మరి నా తలపైన ఏముంది?" అడిగింది వంకాయ.

"కిరీటం!" అన్నాయికూరగాయలు.

"మరైతే ఇంకేమి? నేనే గద, రాజును!" అన్నది వంకాయ.

నాక్కూడా కావాలి ఇంకొంచెం తెలివి!

బాబు: అమ్మా! ఐస్క్రీం కావాలి.

అమ్మ: వద్దు! జలుబు చేస్తుంది!

బాబు: ఊఁ.. నాక్కావాలి!

అమ్మ: వద్దన్నానా!? వద్దంటే ఊరుకోవాలి- అంతే!

బాబు: ఐస్క్రీం తింటే తెలివి తేటలు పెరుగుతాయని మా టీచర్ చెప్పింది.

అమ్మ: అవునా?! ఐతే రెండు తీసుకురా- నీకోటి నాకోటి!

సేకరణ: సుచరిత

నిజాయితీ

సేకరణ: ఈ.దిలీప్ కుమార్,7 వతరగతి,బాయ్స్ హైస్కూల్,నార్పల.

శివపురం జమీందారుగారి దివాణంలో నౌకరీ చేసేవాడు చలమయ్య. జమీందారు దగ్గర పని అన్నమాటే గాని, అతనికి ఒక పాడిగేదె తప్ప వేరే ఎలాంటి ఆస్తులూ ఉండేవి కావు.

ఒకసారి చలమయ్య కొడుక్కి జబ్బు చేసింది. వైద్యుడికి చూపిస్తే ఆ జబ్బు నయం కావడానికి ఐదువేల రూపాయలు ఖర్చు అవుతాయని చెప్పాడు. కాని చలమయ్య దగ్గర అంత డబ్బు లేదు. ఎంతో మందిని అప్పు అడిగాడు గానీ ఎవ్వరూ సాయం చెయ్యలేదు. జమీందారు గారినే అడుగుదామనుకున్నాడు; అయితే కొడుకు పెళ్ళి ఏర్పాట్లలో మునిగి ఉన్న జమీందారుగారు మాట్లాడేందుకు అతనికి సమయం ఇవ్వలేదు.

చలమయ్య స్వతహాగా నెమ్మదస్తుడు. ఏం చేయాలో తెలీక బాధపడసాగాడు.

చూస్తూండగానే జమీందారు కొడుకు పెళ్ళి జరిగింది. పెళ్లిని ఎంతో ఘనంగా జరిపించారు జమీందారు గారు. అతిధులంతా భోజనాలు చేసిన తర్వాత చేతులు కడుక్కోవటానికి ఓ పాత్రను ఏర్పాటు చేశారు. అక్కడి పాత్రలు-పరిశుభ్రత బాధ్యతలు చలమయ్యకే అప్పగించారు.

పెళ్లి ముగిశాక ఆ కుడితి నీటిని చలమయ్య తన గేదె కోసం ఇంటికి తీసుకెళ్లాడు. గేదె ఆ కుడితిని తాగేసింది ఇష్టంగా. అటుపైన కుడితి తొట్టిని శుభ్రం చేస్తున్న చలమయ్యకు దాని అడుగున మెరుస్తూ కనిపించింది ఒక బంగారు ఉంగరం!

"అయ్యో, పాపం. ఎవరిదో, ఈ ఉంగరం! పెళ్ళి భోజనం చేశాక చెయ్యి కడుక్కునేటప్పుడు జారిపోయి ఉంటుంది. ఇప్పుడు ఎంత కంగారు పడుతున్నారో" అనుకున్నాడు చలమయ్య. అంతలోనే జబ్బుతో ఉన్న కొడుకు గుర్తుకువచ్చాడు. ఈ ఉంగరాన్ని అమ్మేస్తే ఐదువేలేం ఖర్మ-పదివేల రూపాయలు కూడా వస్తాయి. తను ఇక ఎవ్వరినీ అప్పు అడగాల్సిన అవసరం ఉండదు..

అయినా ఇతరుల సొమ్మును అమ్మి కొడుకు జబ్బు నయం చేయించుకోవడం సరైన పని అనిపించలేదు చలమయ్యకు. కొంచెం సేపు ఆలోచించి, ఆ ఉంగరాన్ని జేబులో వేసుకొని దివాణానికి బయలు దేరాడు. నేరుగా జమీందారు గారినే కలిసి ఉంగరాన్ని ఆయన చేతిలో పెట్టాడు- తనకు అది ఎలా దొరికిందో చెబుతూ. ఆయన ఆ ఉంగరాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. ఏమంటే అది ఆయన భార్యదే! భోజనాల తర్వాత చేతులు కడుక్కుంటుండగా జారిపోయినట్లుంది. ఆ హడావుడిలో ఆమె గమనించలేదు!

చలమయ్య కొడుకు పరిస్థితి బాగాలేదని, డబ్బుకోసం ఇబ్బంది పడుతున్నాడనీ అప్పటికే జమీందారుగారి దృష్టికి తీసుకెళ్లారు, తోటి పని వాళ్లు. అలాంటి పరిస్థితిలో కూడా చలమయ్య నిజాయితీగా ఉంగరాన్ని అప్పగించటంతో జమీందారు-గారికి చలమయ్య అంటే చాలా గౌరవభావం

కలిగింది. చలమయ్య నిజాయితీని సభాముఖంగా ప్రశంసించి, సొంత ఖర్చుతో వాళ్ళ అబ్బాయికి వైద్యం చేయించారాయన.

జమీందారుగారి ఆదరణకు చలమయ్య కూడా ఎంతో సంతోషించాడు. సకాలంలో వైద్యం జరగడంతో చలమయ్య కొడుకు ఆరోగ్యవంతుడయ్యాడు. 'చలమయ్య నిజాయితీనే అతని కొడుకుని కాపాడింది' అని అందరూ మెచ్చుకున్నారు.

జమీందారు గారు చలమయ్య మీద అభిమానంతో అతనికి మరికొన్ని పాడి గేదెల్ని బహుమతిగా ఇచ్చారు. వాటి నుంచి వచ్చే ఆదాయంతో చలమయ్య ఆనందంగా జీవించసాగాడు.

జోకులు

నీ మాటే వేదం!

జడ్జి: ఎన్నిసార్లయ్యా, చెప్పేది!? మళ్ళీ నాకు కనబడొద్దని ఎన్నిసార్లు చెప్పాను నీకు?

దొంగ: చాలా సార్లు చెప్పారు సార్! కానీ ఆ సంగతి పోలీసులకు ఎంత చెప్పినా వినకుండా లాక్కొచ్చారు సార్ నన్ను!

మంచిబుద్ధి!

సన్యాసిరావు జైలర్ గా ఎందుకు సెలక్ట్ కాలేదు?

ప్రవర్తన బాగా లేని ఖైదీలను బయటకి గెంటేస్తానని ఇంటర్వ్యూలో జవాబిచ్చాడు-ఇక ఎట్లా ఎంపికౌతాడు?.

సేకరణ: సుచరిత

దేవుడి బహుమతి

ఈ కథలో ఉదాత్తత మరీ కొంచెం ఎక్కువే అనిపించిందిగానీ, 'చిన్నారి హరితక్క కష్టపడి ఈ కథని మనకోసం తెలుగు చేసి అందించింది కదా, అచ్చు వేసుకోకపోతే ఎలాగ' అని, కొన్ని మార్పులతో మీ ముందుంచుతున్నాం..

ఆంగ్లమూలం నుండి తెలుగు స్వేచ్ఛానువాదం: హరిత, ఇంటర్మీడియట్ ఒకటవ సంవత్సరం, చెన్నేకొత్తపల్లి.

అనగా అనగా ఒక ఊళ్లో ఒక రైతు ఉండేవాడు. అతను చాలా దయగలవాడు, భక్తిపరుడు; కానీ అతని భార్య మాత్రం లోకం తెలిసిన మనిషి.

ఒకరోజున ఆ రైతు తన పొలంలో దున్నుతూ ఉండగా ఒక మట్టికుండ దొరికింది. దానిని జాగ్రత్తగా పైకి తీసి తెరచి చూస్తే ఏముంది- దాని నిండా బంగారు నాణాలు!

రైతు కొంచెం ఆలోచించాడు- 'అవి తనవేనా, కాదా?' అని. కానీ ఆ ఆలోచన ఎంతకీ తెగేటట్లు లేదు. అందుకని అతను దానిని అలాగే మూసి చెట్టు క్రింద పెట్టేసి, తన పని

తాను చూసుకుంటూ పోయాడు.

సాయంత్రం చీకటి పడే సరికి అతను బంగారు నాణాల కుండ సంగతి పూర్తిగా మర్చిపోయాడు. మెల్లగా నడిచి ఇల్లు చేరుకున్నాడు.

ఆ రాత్రి స్నానం చేసి అన్నం తింటుండగా గుర్తుకు వచ్చింది, ఆ కుండ సంగతి! వెంటనే భార్యకు చెప్పాడు.

ఆమె "అయ్యో! మీరు ఎంత పిచ్చివారండీ! దానిని తీసుకొచ్చి ఉండాల్సింది! అదృష్టం ఎప్పుడూ రెండుసార్లు తలుపు తట్టదట. రేపు మీరు వెళ్ళేంత వరకూ ఆ బంగారు నాణాల కుండ మీకోసం చెట్టుక్రింద ఎందుకు వేచి ఉంటుంది? ఇప్పుడైనా పోండి, పోయి ఆ కుండను తీసుకురండి" అని రాగం మొదలు పెట్టింది.

అయితే ఆ సరికి రైతు బాగా అలసిపోయి ఉన్నాడు. అదీగాక, వాళ్ల పొలం ఇంటినుంచి బాగా దూరంలో ఉన్నది; వానకూడా పడేటట్లున్నది. అందుకని అతను దేవుడి మీదే భారం వేయ నిశ్చయించుకున్నాడు. "చూడు, అది మనకు దేవుడు ఇచ్చిన సంపదే అయితే రేపు నేను వెళ్ళేంతవరకూ అది అక్కడే ఉంటుంది. ఎవ్వరూ దాన్ని ఎత్తుకు పోలేరు" అన్నాడు.

రైతు భార్యకు ఆ నిర్ణయం అస్సలు నచ్చలేదు- కానీ ఏం చేయగలదు? రైతు మొండితనం ఆమెకు తెలుసాయె! మరికొంత సేపు తిట్టి, చివరికి ఆమె ఊరుకున్నది.

అయితే ఆరోజునే రైతు ఇంటిని దోచుకునేందుకు వచ్చిన దొంగలు ఇద్దరు విన్నారు-ఈ కబుర్లన్నీ. "ఓహ్! మన పంట పండిందిరా! ఈ పిచ్చి రైతు పొలం ఎక్కడో తెలుసుగదా, నీకు? అక్కడికి పోదాం వెంటనే" అనుకున్నారు. తక్షణం బయలు దేరి పోయారు.

వాళ్లు పొలంలోకి వెళ్లే సరికి బాగా చీకటిగా ఉన్నది. ముందుగా అనుకొని రాలేదు కనక వాళ్ల దగ్గర దీపం లాంటిది ఏమీ లేదు. అయినా ఆ చీకట్లో కూడా వాళ్ళు తడుముకుంటూ పోయి చెట్టు క్రింద ఉన్న

కుండను కనుక్కున్నారు. ఇద్దరూ ఉత్సాహంతో గంతులు వేస్తూ కుండకున్న మూతను విప్పబోయారు- అంతలో వాళ్లలో ఒకడికి అనుమానం వచ్చింది: "దీనిలో వాడు చెప్పినట్లు డబ్బులే ఉన్నాయో, లేకపోతే ఏ పామైనా దూరి కూర్చున్నదో, ఎలా తెలుస్తుంది?" అని. ధైర్యం చేసి ఇద్దరూ దాని మూత తీసి మెల్లగా కుండలో చేయి పెట్టారు- మెత్తమెత్తగా ఏదో తగిలింది చేతికి. చూడగా అది పామే!

దొంగలిద్దరికీ పై ప్రాణాలు పైనే పోయినట్లు అయ్యింది. వెంటనే కుండను అక్కడ వదిలి దూరంగా పారిపోయారు. అంతలోనే వాళ్లలో ఒకడికి మరో ఆలోచన తట్టింది: "రేపు ప్రొద్దునే ఆ రైతు వచ్చి దీనిని తెరుస్తాడు గదా; ఇందులోనే కూర్చున్న పాము వాడిని కాటు వేసి చంపేస్తుంది. ఆ తర్వాత మనం వాడి ఇంట్లో దొంగతనం చేయవచ్చు!"

ప్రొద్దున్నే రైతు పొలానికి వెళ్ళాక చూస్తే బంగారం ఉన్న కుండ అక్కడే ఉంది: చెట్టు క్రింద. దాని పైన మూత మాత్రం కొంచెం ప్రక్కకి జరిగినట్లుంది. రైతు పెద్దగా ఏమీ ఆలోచించకుండా దాని మూతను సరిచేసి కట్టి పెట్టాడు. 'సాయంత్రం ఇంటికెళ్ళేటప్పుడు తీసుకెళ్లచ్చులే' అని దాన్ని అక్కడే పెట్టి పొలం పనిలో మునిగిపోయాడు. సాయంత్రం చీకటి పడుతుండగా ఇల్లు చేరుకున్నాడు అలవాటు ప్రకారం - మళ్ళీ కుండ సంగతి మరచి.

ఇంట్లో భార్య కుండకోసం ఆత్రంగా ఎదురుచూస్తున్నది . భర్త కుండను తీసుకు రాలేదని ఆమె పెద్ద గొడవే చేసింది. 'రైతు చనిపోయి ఉంటాడులే' అని దొంగతనానికి వచ్చిన దొంగలిద్దరికీ కూడా చాలా నిరాశ కలిగింది. వాళ్ళు 'ఇప్పుడేం చేద్దాం' అని ఆలోచిస్తూండగానే రైతు అన్నాడు భార్యతో- "చూడు, ఎక్కువ గొడవ చేయకు. జరిగిందేదో జరిగింది: ఆ సొమ్ము మనకు దేవుడిచ్చిందే అయితే అది మన ఇంటి దగ్గరకే వస్తుంది. మనది కాని సొమ్ము మనం ఎంత ఆశపడ్డా మనకు దక్కదు" అని.

దొంగలు ఈ మాట విని నవ్వుకున్నారు. "వీడి ఇంటికి వచ్చేది బంగారమో, పామో చూద్దాం"

అని వాళ్ళిద్దరూ మళ్ళీ పొలానికి పోయి, కుండను వెతికి పట్టుకొచ్చారు. రైతు ఇంటి వాకిలి ముందు పెట్టారు. అప్పటికి తెల్లవారవస్తున్నది. దొంగలిద్దరూ చెట్టు చాటున దాక్కొని చూస్తున్నారు- 'ఎప్పుడు రైతు లేచి బయటికి వస్తాడా, ఎప్పుడు కుండను చూసి మురిసిపోతాడా, మూత తెరిచి పాము కాటుకు గురౌతాడా'అని.

అంతలోనే రైతు లేచి వాకిలి తెరిచాడు- ఎదురుగుండా కుండ! కుండలో బంగారు నాణేలు! 'మన సొమ్ము మన ఇంటికి నడిచిరావటం అంటే మరీ ఇంత ఇదిగానా?' అని ఆశ్చర్యపోయింది రైతు భార్య. ఇద్దరూ కలిసి ఆ సొమ్మును బ్యాంకులో దాచుకునేందుకు బయలు దేరారు.

దొంగలిద్దరూ జరిగిన దాన్ని చూసి ముక్కున వేలేసుకున్నారు. 'నిజంగానే మనకు రాసి పెట్టి ఉన్న సొమ్ము మన దగ్గరికి నడిచి వస్తుందా'అని వాళ్లకొక అనుమానం పట్టుకున్నది.

బడి బరువు!

జోకు

టీచర్: దూరపు కొండలు నునుపు - దీనికి ఒక మంచి ఉదాహరణ చెప్పు రాముా!

రాము: మా ఊరి బడిలో పాఠాలు సరిగా చెప్పరని మా నాన్న ఈ ఊరి స్కూల్లో చేర్పించాడు.

సేకరణ: సుచరిత



అనగనగా...

జైసీతారాం గారు ఒకటో తరగతి అయ్యవారుగా చాలా ఏళ్ళు పనిచేసి అలాగే రిట్టైరై, చివరికి పోయిన మామూలు పల్లె మనిషి. ఆయన చెప్పిన కవితలాంటి ఈ రాజకీయ కథ, ఏనాటికీ కొత్తదే. వ్యక్తులు, పేర్లు మారినా, చరిత్ర పెద్దగా మారలేదనిపిస్తుంది దీన్ని చదివితే..

రచన: 'కవికాకి' కీ.శే.జైసీతారాం, కోగిర, రొద్దం మండలం, అనంతపురం జిల్లా.

అనగనగా ఒక ఒకటో తరగతి అయ్యవారు.

ఆ అయ్యవారి తరగతిలో అరవై మంది.

అందులో ఒక అబ్దుల్లా ఆ పూట బడికి రాలేదు.

అబ్దుల్లా అబ్దుల్లా, పొద్దున రాలేదెందుకు?

అమ్మ అన్నం వండలేదు సార్!

అమ్మా అమ్మా, ఎందుకు వండలేదు?

ఆయన బియ్యం తేలేదు.

ఆయనా ఆయనా, ఎందుకు తేలేదు?

ఆఫీసులో జీతం ఇవ్వలేదు.

ఆఫీసూ ఆఫీసూ ఎందుకియ్యలేదు?

ఆర్థిక దుస్థితి! ఆర్థిక దుస్థితి!!

ఆర్థిక దుస్థితీ, ఆర్థిక దుస్థితీ- ఎందుకేర్పడినావు?

అందుకు సమాధానం దేశాన్ని ఏలే దేశాయినడుగు.

దేశాయీ, దేశాయీ ఇందుకు నీ సమాధానమేమి?

అందుకు సమాధానం ఇదివరకటి ఇందిరమ్మనడుగు.

ఇందిరమ్మా ఇందిరమ్మా, ఇందుకు నీ సమాధానమేమి?

అందుకు సమాధానం నా రెక్కలు విరగ్గొట్టి మూలపడేసిన మూఢ ఓటరునడుగు.

ఓటరూ ఓటరూ, ఎందుకు విరగ్గొట్టినావు?

నా బంగారు నోటిని లాకప్పు చేస్తే విరగ్గొట్టక ఊరుకుంటానా?

మా గొప్ప రిక్వెస్ట్!

కవిత

రచన: ఆర్.ప్రగతి, 9వతరగతి, జిల్లాపరిషత్‌హైస్కూల్,వెంకటంపల్లి.

మా క్లాస్ మహా బెస్ట్
అల్లరిలో మేమే ఫస్ట్
టీచర్లు పాఠాలు చెప్పేతీరు బెస్ట్
అర్థం చేసుకోవడంలో మేమే లాస్ట్
పెడతారు మాకు నెలనెల టెస్ట్
అందు మా మార్కులు జస్ట్..
పేరెంట్స్ చూస్తారు మార్కుల లిస్ట్
తీసుకోమంటారు ఇంట్లోనే రెస్ట్
అలా కాకూడదని దేవుడికి రిక్వెస్ట్!



వంకాయ కిరీటం

మనం ఉంటున్న ప్రపంచం ఇలా ఎందుకుందో చెప్పే సరదా కథలు చాలా బావుంటాయి. వంకాయకు కిరీటం ఎలా వచ్చిందో నిజంగా ఎవ్వరికీ తెలీదు- ఇట్లాంటి కథలు చదివేంతవరకూ!

కథనం: చక్రి, సమాలోచన, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లా.

పిల్లలూ! కాయగూరల్లో 'రాజు'అని దేన్ని అంటారో తెలుసా? వంకాయని! ఆ వంకాయ ఎలా వుంటుందో మీ అందరికి తెలుసు కదా?

కానీ ఇప్పుడు మీరు చూస్తున్న వంకాయ ఒకప్పుడు ఇలా ఉండేది కాదట- కోడిగుడ్డులా గుండ్రంగా ఉండేదట! పైన తొడిమ కాని, కాడ కాని ఉండేవి కావట! ఐతే మరి దానికి తొడిమ,కాడ ఎలా వచ్చాయి?

అదో పెద్ద గాథ!

అనగనగా ఒక ఊళ్ళో ఒక రాజుగారు ఉండేవారు.

ఆ రాజుగారు అంటే రాజ్యంలో ప్రజలందరికీ చాలా ఇష్టం.

ఆయన ఒక రోజు కొలువు తీరివున్నాడు.

అంతలో రాజుగారికోసం ఒక బహుమానం తీసుకొని వచ్చాడు ఒక రైతు: "మహారాజా! ఇది నా పొలంలో ఒక చెట్టుకు కాసిన కాయ. దీనిని మన ప్రాంతంలో ఎవరూ చూడలేదు ఇప్పటివరకూ. మొదటగా మీ కోసమే తెచ్చాను" అన్నాడు.

రాజుగారు చాలా సంతోషించారు. రైతుకు బహుమతి ఇచ్చి పంపించారు. కొలువులో ఉన్న శాస్త్రజ్ఞులందరినీ పిలిచారు. ఆ కాయ మీద పరిశోధనలు చేయమన్నారు. అది ఎందుకు పనికి వస్తుందో కనుక్కోమన్నారు.

వాళ్ళు పరిశోధనలు చేసి, అది 'వంకాయ' అని, తినడానికి పనికి వస్తుందని, కూర వండుకుంటే దాని రుచి అమోఘమని తేల్చేసారు.

దానితో ఆ వంకాయ రాజుగారి వంటశాలకు చేరింది.

వంకాయ కూర రాజుగారికి తెగ నచ్చేసింది. రోజూ వంకాయ తీసుకు రమ్మని రైతును ఆజ్ఞాపించారు. రోజూ మధ్యాహ్నంగానీ, రాత్రిగానీ- రాజుగారి భోజనంలో వంకాయ ఉండాల్సిందే.

దానితో రాజుగారికి ఒక ఆలోచన వచ్చింది: 'రాజుగారు ఇష్టంగా తింటున్న కూరగాయ' అని అందరికీ తెలియాలని, వంకాయ మీద కిరీటాన్ని పెట్టమని అజ్ఞాపించారు. అప్పటినుండి వంకాయకు నెత్తి మీద కిరీటం వచ్చి చేరింది. అదే కాలక్రమేణా తొడిమ అయ్యింది.

అయితే మరి ఆ తొడిమకు కాడ ఎలా వచ్చింది? ఇంకా ఉంది కథ:

అట్లా చాలా రోజులు గడిచాయి గానీ రాజుగారు మాత్రం రోజూ వంకాయ కూరను ఇష్టంగా

తింటూనే పోయారు.

ఇంకా చాలా రోజులు గడవగా గడవగా ఇంక ఆయనకు భరించలేనంత కడుపు నొప్పి మొదలైంది.

రాజవైద్యులు ఆయన్ని పరీక్షించి, "కడుపు నొప్పికి కారణం వంకాయను ఎక్కువగా తినడమే" అని తేల్చేసారు.

దాంతో రాజు గారికి వంకాయ మీద ఒళ్ళు మండింది.

తన కడుపు నొప్పికి కారణమైన వంకాయను ఇప్పుడు ఆయన కఠినంగా శిక్షించాలి అనుకున్నాడు.

వెంటనే భటులను పిలిచి వంకాయ నెత్తి మీద మేకు దిగ్గొట్టమని అజ్ఞాపించారు.

రాజుగారు తలచుకుంటే జరగనిది ఏముంది?

దానితో వంకాయ తొడిమ మీదికి మేకులాంటి కాడ వచ్చి చేరింది.

అదన్నమాట, వంకాయ తొడిమ-కాడల కిరీటం కధ!

విడ్డూరం!

డాక్టర్: సారీ, గంట క్రితం హస్పిటల్‌కు తెచ్చి ఉంటే పేషెంట్ బతికేవాడు!

రంగా రావు: యాక్సిడెంట్ జరిగి అరగంట కూడా కాలేదండీ!

సేకరణ: సుచరిత

అనుకరణ

కథల్లో జానపద కథల గమనం విలక్షణం. ఒకింత గ్రాంధికతను గుబాళించే ఈ శైలిని అర్థం చేసుకున్న పిల్లల పదసంపద వృద్ధి చెందక ఏమౌతుంది?
రచన: శ్రీమతి ఆదూరి హైమవతి, విశ్రాంత ప్రధానోపాధ్యాయిని, బెంగుళూరు.

విజయపురి రాజు విక్రమసింహుడికి తన ప్రజలు చాలా విజ్ఞులనీ, తెలివైనవాళ్లనీ నమ్మకం ఉండేది.

ఒకమారు ఆయన బాల్యమిత్రుడు ఆనందభూపతిని కలసినపుడు, మాటల సందర్భంలో "మా ప్రజలు చాలా తెలివైన వాళ్లు, విజ్ఞులు కూడా. అందువలన మాకు మా ప్రజల గురించిన చింత ఏమాత్రం లేదు. వాళ్లు మోసపోడం జరగని పని. ఏ పని చేసినా బాగా తర్కించి చేస్తారు..." అన్నాడు.

"విక్రమా! ప్రజలు ఎంతతెలివైన వారైనా, ప్రతి పనినీ తర్కించి చేస్తారనడం సమంజసంకాదు.

ప్రజలు ఎల్లప్పుడూ తమ ఇరుగు పొరుగులను అనుసరిస్తారు. ఇక తమ ప్రభువును అనుసరించడంలోనైతే వాళ్ళు అసలు ఏమీ ఆలోచించరనే చెప్పాలి" అన్నాడు ఆనందభూపతి .

"కాదు ఆనందా! మా ప్రజల విషయంలో అది జరుగదు. వారు వెట్టిగా ఏమీ అనుసరించరు" అన్నాడు విక్రమసింహుడు, కొంచెం గట్టిగా.

విక్రమసింహుడిని ఇబ్బందిపెట్టడం ఇష్టంలేని ఆనందభూపతి మాట మారుస్తూ "సరే! మిత్రమా, రా! మా ఉద్యానవనం దర్శించుదువుగాని!" అంటూ మిత్రుడిని తమ ఉద్యానవనానికి తీసుకెళ్ళాడు.

వాటి సౌందర్యం చూసి మురిసిపోయిన విక్రమసింహుడు ఆశ్చర్యంతో "ఇంత అందమైన వింత వింత పుష్పాలు, ఇన్ని రకాల ఫలాలు ఎట్లా పండించగలుగుతున్నారు మీరు?! మీ తోటమాలితో నేను మాట్లావచ్చా?" అన్నాడు.

"తప్పక మాట్లాడచ్చు మిత్రమా!-ఎవరక్కడ ? మన ప్రధాన తోటమాలి 'పరమేశు'ని పిలవండి .." ఆజ్ఞాపించాడు ఆనందభూపతి.

రాజాజ్ఞ అందినవెంటనే పరమేశుడు పరుగు పరుగున వచ్చాడు."ప్రభూ ! వందనం " అని వినయంగా చేతులుకట్టుకుని నిల్చాడు.

"పరమేశూ! మన ఉద్యానవనపు అందచందాలు మా బాల్యమిత్రుని మనస్సు దోచుకున్నాయి. ఇంత చక్కని ఫల-పుష్పాలను ఎలా సృజిస్తున్నారని ఆసక్తి చూపగా నిన్ను పిలిచాం" అన్నారు ఆనంద భూపతులవారు అతనితో.

"ప్రభువులకు వందనాలు. హిమాలయాల-నుండి వచ్చిన ఋషీశ్వరులు ఒకరు మా ఉద్యానవనంలో ఆ మధ్య ఒక హిమవన్నగశిలను ప్రతిష్టించారు. దాని ప్రభావంవల్ల మా ఉద్యానవనం నిత్య నూతనమై, రకరకాల ఫలాలను, వింత వింత పుష్పాలను అందిస్తున్నది. ఆ ఋషీశ్వరులు రానున్న ఏకాదశి నాడు మా నగరికి తిరిగి విచ్చేస్తున్నారు. ప్రభూ! ఇబ్బందేం లేదు. ఆ ఋషీశ్వరులు రాగానే తమ రాజ్య ప్రజల కోసం

కూడా ఒక హిమవన్నగ శిలను తెచ్చి, తమ రాచనగరు నడిబొడ్డున నాటి, తమకు విన్నవించుకుంటాను; మా ప్రభువులవారు అనుమతిస్తే" మనవి చేశాడు పరమేశుడు.

"అవశ్యం వెళ్దువు. ఏకాదశి రాగానే ఆ హిమవన్నగ శిలను మా మిత్రుని నగరం నడిబొడ్డున నీవే ప్రతిష్ఠించి, ఆ సంగతి వారికి మనవి చేసిరా. -పద మిత్రమా ! భోజన సమయం అయ్యింది- మనం వెళ్ళి భుజిద్దాం" అంటూ రాజ మందిరంలోకి దారితీశాడు ఆనందభూపతి.

కొన్ని రోజులు గడిచాక, ఒకనాటి ప్రాతః కాలంలో విక్రమసింహుని ఆంతరంగిక సేవకుడు ఆయన దగ్గరకు వచ్చి- "ప్రభువులకు అభివాదం! ఎవరో ఆనందభూపతులవారి ఉద్యానవనానికి ప్రధాన తోటమాలియట! మన నగరం నడిబొడ్డున ఉన్న కూడలిలో 'హిమవన్నగ శిల' అంటూ ఒక రాతిని ప్రతిష్ఠించాడు! మన సైనికులు అతనిని అడ్డగించబోగా తమరి అనుమతి పత్రం చూపాడట. ఆ పైన మంత్రిగారిని కలిసి వారికి ఆ శిల సంగతి విన్నవించుకుని వెళ్ళాడు" అని చెప్పాడు.

విక్రమసింహుడు త్వరగా తయారై వెళ్ళి, నాల్గు వీధుల కూడలిలోని ఆ హిమవన్నగ శిలను దర్శించుకుని వచ్చాడు. అది తెల్లని కాంతులీనుతూ, గుమ్మడి పండులా గుండ్రంగా, ఎంతో ముచ్చటగా ఉంది. విక్రమసింహుడు దాన్ని చేత్తో ముట్టుకుని, తట్టి, దాని అందానికి మురిసి -కొంతసేపు నిల్చి చూసి , తన మందిరానికి తిరిగి వెళ్ళాడు.

ఆ సాయంకాలం రాణిగారు తన పరివారంతో వచ్చి ఆ శిలను దర్శించారు. వారు కూడా దానిని ముట్టి , తట్టి, దాని గట్టిదనాన్ని చూసి , కొంతసేపు దాని ఎదుట ప్రశాంతంగా తలవాల్చి నిల్చి వెళ్ళారు.

దాంతో ఇక దర్శనార్థుల ప్రవాహం మొదలైంది. అందరూ "ఇది నిజంగా చాలా మహిమాన్వితమైన శిలయే! లేకపోతే మహారాజేగాక , మహారాణి సైతం అంతఃపురం నుండి వచ్చి దర్శించి వెళతారా!?" అనటం మొదలు పెట్టారు. ప్రతిఒక్కరూ వచ్చి, దాన్ని

తట్టి, తాకి, ఎదుట కొంత సేపు నిలబడి వెళ్ళసాగారు.

ఒక వారం రోజుల్లో ఆ శిల మహత్తును గురించిన కథలు దేశమంతటా వినిపించ సాగాయి. జనం తండోపతండాలుగా కదలి రాసాగారు. కొందరు "ఆ శిలను ముట్టగానే మా జ్వరం తగ్గిందంటే , మరొకరు నాతలనొప్పి తగ్గిందనీ, మరొకరు పిల్లలు లేని మా కోడలికి బిడ్డడు పుట్టాడనీ , మాకు పంట బాగా పండిందనీ , మాకు వ్యాపారం కలసి వచ్చి లాభాల పంట పండిందనీ .." ఇట్లా రకరకాలుగా చెప్పుకోసాగారు.

ఇలా నెలరోజులు గడిచాయి. అంతలో ఆనందభూపతులవారు నగరానికి విచ్చేస్తున్నట్లు వార్త వచ్చింది. ఆయనకు ఎదురువెళ్ళి ఆహ్వానించేందుకు ప్రధాన ద్వారం వద్దకు బయల్దేరాడు విక్రమసింహుడు.

ఐతే నాల్గు వీధుల కూడలి దగ్గర ఎంత రద్దీగా ఉందంటే, దాన్ని దాటి వెళ్ళేందుకు రథానికి దారి లేదు- ఆ హిమవన్నగ శిల వద్ద బారులు తీరి నిలబడి ఉన్నది అశేష జన వాహిని! ఒక్కరొక్కరుగా దాన్ని తాకి నమస్కరించే అవకాశంకోసం ఎదురు చూస్తున్నారు అందరూ! ఇంతలో ఆనంద భూపతులవారు రానే వచ్చారు.

"మిత్రమా ఆనందా! మన్నించాలి , మిమ్మల్ని ద్వారంవద్దే ఆహ్వానించాలని బయల్దేరాను. కానీ ఈ జనసంద్రాన్ని చూశారు కదా, నాకు ముందుకు కదిలే అవకాశమే లభించలేదు" అంటూ ఆహ్వానించాడు విక్రమసింహుడు .

బావుంది మిత్రమా! మన మధ్య ఈ మన్నింపులేంటి? ఇంతకూ ఈ జనమంతా ఎందుకోసం ఈ బారులు తీరినట్లు?"అని అడిగిన ఆనందభూపతితో "మిత్రమా! ఇదంతా నీ చలవే సుమా! ఈ హిమవన్నగశిల వచ్చాక మాప్రజలందరూ అత్యంత సుఖ

శాంతులతో, సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటున్నారు. కృతజ్ఞతా భావంతో వారంతా ఆ శిలను ముట్టి, నమస్కరించుకుని వెళుతుంటారు" చెప్పాడు విక్రమసింహుడు .

"మిత్రమా విక్రమా! మీరు మరోలా భావించకుంటే, నన్ను మన్నించానంటే ఒక విషయం బయల్పరుస్తాను.."

"అలా అనకండి ఆనందా! మనం మంచి మిత్రులం. మనమధ్య అంతరాలే ఉండవు.."

"ఏం లేదు విక్రమా, గుర్తు తెచ్చుకోండి- మీరు మా నగరానికి వచ్చినపుడు ఏమన్నారో! మీ ప్రజలు విజ్ఞులనీ, ఏ పనైనా తర్కించిచేస్తారనీ అన్నారు మీరు. నిజానికి అసలు ఇది హిమవన్నగ శిలే కాదు- మా శిల్పులు పాలరాతితో చెక్కిన రాయి ఇది. మీరు దాన్ని చూసి తట్టగానే, ప్రజలందరూ కూడా దీన్ని మహిమగల శిలగా భావించి నమస్కరించడం మొదలెట్టారు, చూశారు గద! ఐతే వాళ్ళు సహృదయులు, కష్టించి పని చేసేవారూ గనుక వారి కోరికలన్నీ తీరుతున్నాయి- అంతే. ప్రజలు ప్రభువును అనుసరిస్తారే తప్ప, వారి విజ్ఞతను కాదు. మన్నించండి- ఇది నేటి ప్రజల నైజాన్ని తెల్సుకునేందుకుగాను మేం చేసిన చిన్న పరిశోధనే తప్ప, మరేమీ కాదు. అన్యథా భావించకండి- మన స్నేహానికి దెబ్బ రానివ్వకండి " అంటూ చేతులు కలిపాడు ఆనందభూపతి.

"నిజమే, మిత్రమా! ప్రజలు పాలకులను సంకోచం లేకుండా అనుకరిస్తుంటారు. అందువల్లనే ప్రభువులకు మచ్చలేని వ్యక్తిత్వం అవసరం" మనసారా అంగీకరిస్తూ అన్నాడు విక్రమసింహుడు.

పిల్లలు - బొమ్మలు

స్పందన

కొత్తపల్లి మే 2011 సంచికలో ఇచ్చిన 'బొమ్మకు కథ రాయండి' కి స్పందన ఇది...
రచన: రాధ మండువ, ఉపాధ్యాయిని, రిషివ్యాలీ స్కూల్, మదనపల్లి.

పసలపూడి అనే గ్రామంలో పద్మనాభాచారి అనే వడ్రంగి ఉండేవాడు. మంచికొయ్యని కొని, దానితో రకరకాల బొమ్మలు చేసి, సంతలో అమ్మేవాడు ఆచారి. కానీ అతని సంపాదన మాత్రం అంతంత మాత్రంగానే ఉండేది. వాళ్ళ కుటుంబ ఖర్చులకు బొటాబొటిగా సరిపోయేది. ఆచారికి ఇద్దరు కూతుళ్ళు- ఈశ్వరి, పార్వతి. పార్వతి ఎనిమిదవ తరగతి, ఈశ్వరి పదవ తరగతి చదువుతున్నారు. ఇద్దరూ చాలా మంచి పిల్లలు.

ఒకరోజు రాత్రి ఆచారి భార్య వరమ్మ "ఏమండీ! వచ్చే నెలే తిరణాల. కొంచెం అప్పుచేసైనా సరే, ఎక్కువ బొమ్మలు తయారు చేయండి. తిరణాల్లో వ్యాపారం ఏ కొంచెం జరిగినా మన అప్పూ తీరుతుంది; వచ్చే సంవత్సరం

ఈశ్వరిని కాలేజీలో చేర్పించేందుకు డబ్బూ సమకూరుతుంది" అంది. అప్పు చేయడం ఆచారికి ఇష్టం లేదు. కానీ పిల్లని కాలేజీకి పంపించాలంటే అంతకంటే మార్గం లేదు! అందుకని మర్నాడు ఆ ఊళ్ళో వడ్డీకి డబ్బులు ఇచ్చే బ్రహ్మయ్య దగ్గరికి వెళ్ళాడు. నెల రోజుల్లో బాకీ తీర్చేస్తానన్నాడు. పత్రం మీద సంతకం చేసి డబ్బు తీసుకున్నాడు. అటునుండి అటే పట్నం వెళ్ళి కొయ్యను కొనుక్కొచ్చాడు.

ఇక ఆ రోజు నుండీ రాత్రింబవళ్ళూ కష్టపడి రకరకాల బొమ్మలు చెక్కటం మొదలు పెట్టాడు ఆచారి. శివపార్వతులు, సిద్ధి బుద్ధి వినాయకులు, స్త్రీ పురుషులు, జంతువులు, పక్షులు, గంటలు, గోపురాలు - ఇలా ఒకటేమిటి, అన్ని రకాల బొమ్మలూ అద్భుతంగా తయారవుతున్నాయి. ఈశ్వరి, పార్వతి కూడా తండ్రికి సహాయం చేస్తున్నారు. పార్వతి అయితే బడి పిల్లలందరినీ పిలిచి బొమ్మలు చూపించింది. అన్నన్ని బొమ్మలను చూసి పిల్లలందరూ మురిసిపోయారు. కొందరు పిల్లలైతే, రోజంతా అక్కడే ఉండి ఆచారికి సహాయం చేశారు. తిరణాల దగ్గరకు వస్తోంది. చెక్కిన బొమ్మలకు రంగులు వేయడం ప్రారంభించాడు ఆచారి. ఇప్పుడు అవి ఇంకా అందంగా మెరిసిపోతున్నాయి. బడి పిల్లలు రోజూ స్కూలు విడిచి పెట్టాక వచ్చి చూస్తున్నారు వాటిని. రంగులు ఏవేవి వెయ్యాలో, ఎలా వెయ్యాలో ఆచారికి చెబుతూ ఆనందపడిపోతున్నారు.

అయితే తిరణాల ఇంకా రెండు రోజులుండనగా వాన ముసురు పట్టుకుంది. అందరిలోనూ ఆందోళన మొదలైంది. తిరణాల రోజున కూడా ముసురు వదలనే లేదు. ఊరంతా బోసిపోయింది- వాన ముసురు కారణంగా తిరణాలకు అస్సలు జనమే రాలేదు. బొమ్మలన్నీ ఉన్నవి ఉన్నట్టు పడి ఉన్నాయి: వాటిని చూస్తూంటే ఆచారికి దు:ఖం ఆగట్లేదు. ఏం చేయాలో తోచడం లేదు.

నెల గడిచిందో లేదో, మనుషుల్ని వెంటబెట్టుకొని ఊడి పడ్డాడు బ్రహ్మయ్య. ఆచారి అతని కాళ్ళావేళ్ళా పడ్డాడు- మరొక్క

నెల సమయం ఇవ్వమని వేడుకున్నాడు. బ్రహ్మయ్య వినలేదు. ఇష్టం వచ్చినట్టు తిట్టాడు. అతనితోబాటు వచ్చిన మనుషులు ఆచారి ఇంట్లో ఉన్న సామానంతా ఎత్తి బయట పడేయసాగారు. అడ్డం వచ్చిన వరమ్మను బ్రహ్మయ్య ఒక్క త్రోపు తోశాడు. క్రింద పడిన వరమ్మకు కాలు విరిగింది. వెక్కి వెక్కి ఏడుస్తున్నారు పిల్లలు. వాళ్లను కూడా తన్నుకుంటూ ఇంట్లో ఉన్న తట్టలు-బుట్టలు ఎత్తుకుపోయాడు బ్రహ్మయ్య.

సంగతి తెలిసి స్కూలు పిల్లలు, టీచరు పరిగెత్తుకుంటూ వచ్చారు. అందరూ కలిసి వరమ్మని వైద్యుని దగ్గరకు తీసుకు వెళ్ళారు. విరిగిన కాలుకు మామూలు కట్టు సరిపోదు- ఆపరేషన్ చేయాలన్నారు డాక్టరు. ముఖం చేతులతో కప్పుకుని ఏడుస్తున్న ఆచారిని, ఈశ్వరిని, పార్వతిని పిల్లలు ఓదార్చారు. ఇంట్లో చెల్లా చెదరుగా పడి ఉన్న కొయ్య బొమ్మల్ని పిల్లలంతా కలిసి ఒక చోట కుప్ప పోశారు. క్రిందటి రోజు వరకూ మిలమిలా మెరిసిపోయిన ఆ బొమ్మలు ఇప్పుడు తెలవెలబోతున్నట్లు అనిపించాయి.

మర్నాడు పిల్లలందరూ ఆచారి ఇంటి ముందు గుమిగూడారు. అక్కడున్న రంగులను పూసుకుని అందరూ కొయ్యబొమ్మలలా తయారయ్యారు. మునసబు గారి అబ్బాయి రఘు, ధర్మయ్య గారి అబ్బాయి వేణు బండ్లు తెచ్చారు. బొమ్మలన్నింటినీ పిల్లలే బండ్లపైన ఎక్కించారు. డప్పుల దరువులు మొదలయ్యాయి. ఊళ్ళో వీధి వీధికీ తిరుగుతూ బొమ్మలను అమ్మటం మొదలు పెట్టారు పిల్లలు.

కొయ్యబొమ్మల్లాగా అలంకరించుకున్న పిల్లల్ని అందరూ ముచ్చటగా చూశారు. వరమ్మ ఆపరేషన్ గురించి తెలిసిన ఊళ్ళో వాళ్ళు

చెప్పిన రేటు కంటే రెండు రూపాయలు ఎక్కువే ఇచ్చి బొమ్మలను కొనుక్కున్నారు. పిల్లలు చుట్టు ప్రక్కల ఊళ్ళల్లో కూడా తిరుగుతూ బొమ్మలు అమ్మారు. మర్నాటికల్లా ప్రక్క ఊళ్ళ పిల్లలు కూడా వీళ్ళతో చేరారు! రంగులు పూసుకొని, ఉత్సాహంగా ఎగురుతూ బొమ్మలు అమ్మటం అంటే ఎవరికి ఇష్టం ఉండదు? కొంతమంది పెద్ద పిల్లలు ఆచారితో బాటు కూర్చున్నారు. మిగిలిన చెక్కతో మరిన్ని బొమ్మలు చెక్కించసాగారు. కొందరు వాటికి రంగులు వేశారు. అటు అవి ఆరాయో లేదో, మరికొందరు పిల్లలు వాటిని పట్టుకొని అమ్మేసేందుకు పరుగెత్తారు.

మూడో రోజున బొమ్మలు అమ్మడానికి బ్రహ్మయ్య కూతురు, కొడుకు కూడా బయలుదేరారు! ఒకవైపున పిల్లలు ఊరూరా తిరిగి బొమ్మలు అమ్ముతుంటే, మరొక వైపున ఊళ్ళో పెద్దలంతా ఒకచోట చేరి చర్చించుకున్నారు. మామూలుగా కరకుగా ఉండే బ్రహ్మయ్య ఎందుకనో, బాగా మెత్తబడ్డట్లు అనిపించాడు. పెద్దవాళ్లంతా కలిసి డాక్టరు దగ్గరికి వెళ్ళి మాట్లాడినప్పుడు, బ్రహ్మయ్య తనంతట తానే ముందుకొచ్చి, ఆపరేషన్ ఖర్చులన్నీ తనే భరిస్తానన్నాడు! డాక్టరు గారు కూడా, తక్కువ ఖర్చుతో ఆపరేషన్ చేస్తానన్నారు. వెంటనే ఆపరేషన్ జరిపి కట్టు కట్టారు కూడాను.

సాయంత్రానికి బొమ్మలు అమ్మి ఇంటికి వచ్చిన బడి పిల్లలకి ఈ విషయం తెలిసింది. పట్టరాని సంతోషంతో అందరూ చిందులేశారు.

మిగిలిన కొన్ని బొమ్మల్నీ వరమ్మకు బహుమతిగా ఇచ్చారు పిల్లలందరూ.

ఆ పిల్లల నవ్వు ముఖాల్ని చూసిన ఆచారి తన కొయ్య బొమ్మలన్నీ ఒక్కసారిగా ఎలా ప్రాణం పోసుకున్నాయా, అని ఆశ్చర్యపోయాడు.

శని-శివుడు

మూలం: పర్తాప్ అగర్వాల్, స్టోరీస్ ఫర్ ఎ డాటర్.
తెలుగు అనువాదం: నారాయణ, కొత్తపల్లి బృందం.

ఒక రోజు, ఇంకా కొంచెం సేపట్లో తెల్లవారుతుందనగా, శివుడికి ఒక కల వచ్చింది. ఆ కలలో శనిదేవుడు వచ్చాడు తన దగ్గరికి. "నేను ఇవాళ్ళ- సాయంత్రం ఆరు గంటలలోపల- నీ నెత్తినెక్కి నా ప్రభావం చూపిస్తాను- అదీ కనీసం 4-5 గంటల పాటు!" అన్నాడు.

శివుడికి మెలకువ వచ్చింది- దాంతో పాటు కోపం కూడా. "ఈ శని నన్నేం చేయగలడు? అయినా నేను ఎవరనుకుంటున్నాడు, వీడు?

మామూలు ప్రాణులతో ఆడుకున్నట్లు నాతో ఆడుకోగలననుకుంటున్నాడేమో- ఈసారి వీడికి ఒక మంచి గుణపాఠం లభిస్తుంది- గొప్పవాళ్ళతో పెట్టుకోకూడదని తెలుస్తుంది" అనుకున్నాడు శివుడు.

కానీ సమయం దగ్గర పడుతున్న కొద్దీ శివుడికి కంగారు ఎక్కువైంది: "శని చిలిపి చేష్టల వల్ల ప్రమాదం పెద్దగా ఉండదుగాని, కష్టం మాత్రం బాగానే ఉంటుంది. అందుకని ముందుగానే అన్నిటికీ సిద్ధపడి ఉండటం అవసరం" అనుకున్నాడు.

వెంటనే పార్వతిని స్నేహితుల ఇంటికి ఎక్కడికో పంపించాడు హడావిడిగా. పిల్లలిద్దరినీ బంధువుల ఇళ్లకు పంపించాడు. తన వాహనం-ఎద్దు-ను పశువైద్యుడి దగ్గరికి పంపించాడు.

మరి తను?- తనకోసం కైలాసంలోనే ఒక మూలన, లోతైన గుంతను ఒకదాన్ని త్రవ్వించుకున్నాడు. అనుకున్న సమయానికి కొంచెం ముందుగానే ఆ గుంతలోకి దిగి, లోపల లోతుగా కూర్చొని, పైన మూత పెట్టేసుకున్నాడు. అక్కడ మట్టి అంతా కొంచెం తడి తడిగా, వాసనగా, అసౌకర్యంగా ఉన్నది. అయినా ఆ గుంతలోనే కూర్చొని, శనికోసం ఎదురుచూడటం మొదలు పెట్టాడు శివుడు.

"ఈ శనికి పంతం ఎక్కువ..మాట నెగ్గించుకోవటంకోసం ఏమైనా చెయ్యగలడు వాడు. ఇప్పుడు నన్ను ఏం చేద్దామని అనుకున్నాడో, మరి- చూద్దాం" అనుకుంటూ కూర్చున్నాడు. గంట..రెండు గంటలు..మూడు గంటలు గడిచాయి- అయినా శని జాడలేదు!

శివుడు అనేక విధాలుగా ఆలోచిస్తున్నాడు.."ఏమై ఉంటుంది? శని ఈ చుట్టు ప్రక్కలే ఎక్కడో తిరుగుతూ ఉండి ఉంటాడు. నేను ఇక్కడ దాక్కున్న సంగతి తెలీలేదేమో. లేకపోతే నాతో తలపడేందుకు ధైర్యం చాలట్లేదేమో, పిరికి పందకు!" అనుకున్నాడు.

ఇంకో రెండు గంటలు గడిచాయి- "వట్టి వదరుబోతు! ఎంతలేసి మాటలు

మాట్లాడాడు?! ఇప్పుడు వాడి గర్వం పూర్తిగా అణగిపోయి ఉంటుంది. మంచిదేలే, ఎవరితో ఎట్లా మాట్లాడాలో అర్థం అయి ఉంటుంది కొంచెం. నాతో పెట్టుకుంటే ప్రయోజనం ఉండదని తెలిసి ఉంటుంది" అనుకున్నాడు.

అంతలో సమయం ఆరు గంటలు అవ్వనే అయ్యింది. శని రానే లేదు! "పిరికివాడు- మాటలన్నీ మూటగట్టుకొని ఏ మూరు మూలనో దాక్కొని ఉంటాడు- శివ కోపాగ్నిని ఎదుర్కొంటే ప్రమాదం అని గ్రహించి, ఎక్కడో నక్కి ఉంటాడు, పాపం!" నవ్వుకున్నాడు శివుడు. గుంతలోనుండి బయటికి వచ్చి, మెల్లగా వాళ్ల ఇంటివైపుకు నడవటం మొదలు పెట్టాడు, చిరునవ్వుతో.

అంతలో అక్కడే ఒక చెట్టు క్రింద దర్జాగా కాలుమీద కాలు వేసుకొని పడుకున్న శని కనబడ్డాడు. శివుడు విజయగర్వంతో చెట్టు దగ్గరికి వెళ్ళాడు. శివుడిని చూడగానే శని నమస్కారం చేశాడు. శివుడు కులాసాగా నవ్వుతూ అడిగాడు- "ఏమైంది, చిన్నోడా?! నువ్వన్న మాటలు మర్చిపోయావా, లేకపోతే భయపడి వెనక్కి తగ్గావా? అయినా నువ్వు ఇంకాచాలా నేర్చుకోవాల్సింది ఉందిలే- ఎవరినన్నా పీడించాలని అనుకునే ముందు, నువ్వు 'వాళ్లు ఎంత బలవంతులు' అనేది జాగ్రత్తగా గమనించి తెలుసుకోవాలి. ఎదుటివాళ్ళ శక్తి సామర్థ్యాలను తెలుసుకోకుండా ఊరికే బీరాలు పలుకకూడదు- అర్థమైందా? ఈ మాత్రం గుణపాఠం అయితే దొరికింది గద, నీకు!?" అన్నాడు పెద్దమనిషిలాగా.

శని గట్టిగా నవ్వాడు. "పరమ శివా! నమస్కారం! నువ్వు వట్టి 'భోళా శంకరుడివి' అని విని ఉన్నాను గానీ, మరీ ఇంత అమాయకుడివని కలలో కూడా ఊహించలేదు.

నేను నిన్ను అన్ని కష్టాల పాలు చేసినా, ఇంకా నువ్వు నా ప్రభావాన్ని గుర్తించనే లేదంటే ఆశ్చర్యంగా ఉంది. నువ్వు నీ భార్యను, పిల్లలను, చివరికి నీ వాహనాన్నికూడా ఎక్కడికో పంపించాల్సి వచ్చింది; నేలలో,

అంతలోతు గుంతలో, తడి తడిగా, వాసన వాసనగా ఉండే మూరు మూల ప్రదేశంలో- ఒకటి రెండు కాదు- ఆరు గంటల పాటు నక్కి కూర్చోవాల్సి వచ్చింది! ఇదంతా నా ప్రభావం వల్ల కాకుంటే మరి దేనివల్ల?!

మిత్రమా, నిన్ను చూస్తుంటే నవ్వాలో, ఏడవాలో తెలీటం లేదు నాకు. పట్టణాల్లోను, నగరాల్లోను, ఆ ఘోరమైన- మురికి, దుర్వాసన, ఇరుకు కూపాల మధ్యన పడి బ్రతుకుతూ, అయినా తమకు కార్లు ఉన్నాయనీ, ఎయిర్ కండిషనర్లు ఉన్నాయనీ, టివిలున్నాయనీ సంబరపడుతూ, తమను తాము అదృష్టవంతులుగా భావించుకునే వెర్రి మనుషులకంటే నువ్వు ఏమంత తెలివైన వాడివి కావని నాకు అర్థమైంది. కానియ్యి స్వామీ, ఏం చేస్తాం?" అన్నాడు శని, ఎగతాళిగా నిట్టూరుస్తూ.

నడిపిద్దాం!

టీచర్: పోస్ట్ మాన్ ఉత్తరాలు ఎందుకు తీసుకు వెళ్తాడు?

రవి: వాటంతటఅవి వెళ్లలేవు కాబట్టి!

కారెందుకు?

కనబడిన వాళ్ళనల్లా అప్పడిగిన అప్పారావు కారెందుకు కొనుక్కున్నాడు?

నడచి వెళ్తుంటే అప్పులోళ్లు వెంట పడుతున్నారని!

డాక్టర్ కు ఇష్టమైన వాడు ఎవరు?

జేబునిండా డబ్బులు, ఒంటి నిండా జబ్బులు ఉండేవాడు.

సేకరణ: సుచరిత

మన ఇల్లు

మూలం: పర్తాప్ అగర్వాల్, స్టోరీస్ ఫర్ ఎ డాటర్
తెలుగు అనువాదం: నారాయణ, కొత్తపల్లి బృందం.

అనగా అనగా గొప్ప తాపీ మేస్త్రి ఒకడు ఉండేవాడు. అతని నైపుణ్యం అద్భుతం! అతని పనితనం అసామాన్యం; అనితర సాధ్యం! ముప్ఫై సంవత్సరాలుగా అతను ఒక కాంట్రాక్టరు క్రింద పని చేస్తూ వచ్చాడు. ఆ కాంట్రాక్టరుకు కూడా మేస్త్రి అంటే చాలా గౌరవం అభిమానం- అందువల్లనే వాళ్ళ సంబంధం అన్ని సంవత్సరాలపాటు కొనసాగింది.

చివరికి ఒక రోజున మేస్త్రి కాంట్రాక్టరుతో చెప్పేశాడు- "అయ్యా! ప్రస్తుతం మనం చేస్తున్న ఈ పనేదో అయిపోగానే, నేను ఇక రిటైరు అయిపోతాను. బాగా పెద్దవాడిని అయిపోయాను, కొంచెం బలహీనంగా కూడా అవుతున్నట్లుంది. ఇప్పుడిక పనిని

చాలించాలి. మిగిలిన కొద్దిపాటి జీవితాన్ని విశ్రాంతిగా గడుపుదామని ఉన్నది. ఈ సంగతిని కొంచెం ముందుగానే తెలియజేస్తున్నాను మీకు- ఏమంటే పనిలో కష్టం కలగకూడదు గద, అందుకని" అన్నాడు. కాంట్రాక్టర్ సన్నగా నవ్వాడు. సరేనన్నట్లు తల ఊపాడు.

చేస్తున్న పనేదో ముగింపుకు వచ్చింది. పని ఆరోజుతో అయిపోతుందనగా కాంట్రాక్టరు మేస్త్రీని పిలిచి- "ఈ పని అయిపోగానే రిటైరు అయిపోతానన్నావు. నేను అందుకు ఒప్పుకున్నాను కూడాను. ఇదంతా నాకు గుర్తులేక కాదు- కానీ నాదొక చిన్న అభ్యర్థన- కాదనకు. నాకోసం మరొక్క చక్కని ఇల్లు- ఒక్కటంటే ఒక్కటి- కట్టి ఇచ్చి వెళ్ళు. ఆ తర్వాత నేను ఇక నిన్ను ఆపను. మరొక్క ఇల్లు- అంతే- ఏమంటావు?" అన్నాడు.

మేస్త్రీకి ఈ మార్పు అస్సలు నచ్చలేదు. అయినా ఏం చేస్తాడు, చాలా కాలంపాటు పని చేసి ఉన్నాడు- కాదనటానికి లేదు- అందుకని అయిష్టంగానే ఒప్పుకున్నాడు.

ఒప్పుకున్నాడన్నమాటే గాని, నిజంగా కొత్త ఇంటి పని మొదలయ్యేసరికి, మేస్త్రీకి ఆ పని పెద్ద బరువులాగా తోచింది. ఏమాత్రం ఇష్టం కాలేదు. పనిలో అస్సలు మనసు నిలవలేదు.

దాంతో ఆ పని అరకొర వేగంతో, దాని ఇష్టం వచ్చినట్లు అది సాగింది. నిర్మాణపు క్వాలిటీకూడా బాగా రాలేదు. మేస్త్రీ ఆ మార్పును గమనించాడు- అయినా సర్దుకు పోయాడు. "ఏంచేస్తాం, ఇంతే!" అనుకున్నాడు. మధ్య మధ్యలో కాంట్రాక్టరు వచ్చి సలహాలూ, సూచనలూ ఇస్తూనే వచ్చాడు. అయినా మేస్త్రీ వాటిని అన్నిటినీ పెడచెవిన పెట్టాడు. "ఎలాగో ఒకలాగా అయిపోనీ, పని గడిస్తే చాలు" అనుకున్నాడు.

కొత్త ఇంట్లో పని పూర్తయ్యే సమయానికి కాంట్రాక్టరు వచ్చి చివరి ఇన్స్పెక్షను చేశాడు. నిర్మాణపు పనితనం బాగాలేదు: చాలా లోపాలు కనబడ్డాయి. ఆయనేమీ ఆశ్చర్యపోలేదు- ముందునుండీ చూస్తూనే ఉన్నాడు గద! నిట్టూర్చాడు. ఆపైన మెల్లగా జేబులోంచి తాళాల గుత్తి తీసి, మేస్త్రీ చేతికి

ఇస్తూ అన్నాడు- "మిత్రమా! ఇదిగో, ఈ ఇల్లు ఇక నీదే. ఇంటి తాళాలివిగో- అందుకో. మన స్నేహానికి గుర్తుగా నేను నీకు ఇవ్వదలచిన బహుమతి ఇది" అని.

మేస్త్రి నిర్ఘాంతపోయాడు. "ఎంత ఘోరం జరిగిపోయింది! ఈ సంగతి ముందుగానే తెలిసిఉంటే ఎంత బాగుండేది?! తను ఆ ఇంటి నిర్మాణంలో జీవం పోసి ఉండేవాడే! ఇప్పుడు ఇక చేయగలిగింది ఏమీ లేదు. లోపభూయిష్టమైన ఈ ఇంట్లో తన శేష జీవితాన్ని గడపాల్సిందే; తన తప్పుల్ని తను ప్రతిరోజూ చూస్తూ, ప్రతిరోజూ సిగ్గుపడుతూ గడపాలి! అయ్యో! ముందుగానే తెలిసి ఉంటే ఎంత బాగుండేదో! ఇప్పుడేమీ చెయ్యలేమే!" అని కుమిలిపోయాడు.

మన ఈ శరీరాల్ని నిర్మించుకునే మేస్త్రీలం మనమే. మనదే ఈ ఇల్లు. ఇందులో ఉండాల్సిందీ మనమే. మనం మన యీ శరీరాన్ని ప్రేమ, ఆప్యాయతలతో శ్రద్ధగా నిర్మించుకుంటే, అది మనకు అనుకూలంగాను, వసతిగాను ఉంటుంది. బాగా పని చేస్తుంది. అట్లా కాక, మనం దాని పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే, అది పాడౌతుంది- అప్పుడు ఇక మనం బాధగా, పశ్చాత్తాపంతో బ్రతకాల్సిందే.

మన ఆరోగ్యం నిజంగా మన చేతుల్లోనే ఉంది!

ముల్లుకి ముల్లు!

జోకు

టీచర్: అదేంట్రా? కాలుకి ఇన్ని ముళ్లు ఎలా గుచ్చుకున్నాయి?

విద్యార్థి: మొదట ఒకటే గుచ్చు కుంది టీచర్. అయితే ముల్లును ముల్లుతోనే తీయమన్నారు గదా అని, ఒకదాని తర్వాత ఒక ముల్లు గుచ్చుకుంటూ పోయాను...చివరికి ఇన్ని అయ్యాయి.

సేకరణ: సుచరిత

ఇంద్ర ధనస్సు

రచన: శ్రీవారణాసి వెంకట్రావుగారు, విజయవాడ

గానం: జగన్‌సంప్రీత్, విజయవాడ.

సౌజన్యం: 'రంగులపూలు'- విద్యార్థి సృజనకుటీర్, విజయవాడ.

అమ్మా అమ్మా చూడమ్మా
అదిగో మెరిసే ఇంద్రధనసు
నింగికి నేలకు ఎవరో
రంగులవంతెన వేశారే
రంగుల వంతెన వేశారే
"అమ్మా అమ్మా చూడమ్మా"

పైపైపైకి ప్రాకి
చందమామనే తాకిరానా?
అక్కడినుండి ఎగిరి
చుక్కలలోకం చూచిరానా?
"అమ్మా అమ్మా చూడమ్మా"

ఆ పక్క చూస్తే సూర్యుడు
పైనుండి పడే జల్లులు
ఈ పక్క మాపున ఇంద్రధనస్సు
నడుమ తడుస్తూ నేను భలేగా
"అమ్మా అమ్మా చూడమ్మా"

ఎరుపు నారింజ పసుపు పచ్చ
ఆకుపచ్చ నీలం ఆకాశ నీలం ఊదా
ఇంత చక్కని రంగుల వంతెన
వింతకాదటే ఓ అమ్మా?
వింతకాదటే ఓ అమ్మా!
"అమ్మా అమ్మా చూడమ్మా"

ఇంటర్నెట్లో http://kottapalli.in వద్ద
ఈ పాటలన్నిటినీ వినే వీలున్నది. సందర్శించండి!



జల జల పారే సెలయేరు

రచన, గానం; కవికాకి కీ.శే.జైసీతారాం, కోగిర, రొద్దం మండలం, అనంతపురం జిల్లా

జల జల పారే సెలయేరు
పిలిచెను నన్ను పలుమారు
కిల కిల నవ్వుతూ పరుగెత్తుదమా
అహహా అహహా ఓపాపా?! "జల జల"

గల గల వీచే చలి గాలి
పిలిచెను నన్ను బ్రతిమాలి
లలలా పాటలు పాడుదమా
లలల్లా లలల్లా ఓ బాలా "జల జల"

చిటపట కురిసే చినుకుల్లు
చిలకరించినవి విరిజల్లు
చిందులు వేస్తూ ఆడుదమా
చిన్నారి పొన్నారి ఓ పాపా?! "జల జల"

బుర్ బుర్ పాంపాం

రచన: శ్రీ బాలాంత్రపు రజనీకాంత రావుగారు, విశాఖపట్నం
సౌజన్యం: ఫోరం ఫర్ చైల్డ్ సెంటర్డ్ ఎజుకేషన్, విజయవాడ.

బుర్ బుర్ పాంపాం
బుర్ బుర్ పాంపాం
బుర్-బుర్- పాంపాం (2)

డ్రైవర్ సీట్లో కూర్చుందెవరు
స్టీరింగ్ చక్రం తిప్పేదెవరు (2)
యాక్సిల్ చక్కలు తొక్కేదెవరు? (2)
ఇంకెవరెవరు..ఇంకెవరెవరు..
మాపాపే!
"బుర్ బుర్ పాంపాం"

ఏటి ఒడ్డున తోటలలోన
బీచు ఒడ్డున బాటలపైన
కారు షికారు పోయేదెవరు? (2)
ఇంకెవరెవరు..ఇంకెవరెవరు...
మాపాపే!
"బుర్ బుర్ పాంపాం"

పల్లపు దారి చల్లగ జారి
మెట్ట దారిని మెట్టుగ ఎక్కి (2)
చదును దారిని సాగేదెవరు?
ఇంకెవరెవరు..ఇంకెవరెవరు..
మాపాపే!
"బుర్ బుర్ పాంపాం"

పదరంగం-5

ఈ పదరంగం చాలా సులభం! దీన్ని పూరించి పంపండి. మీ పేరుతో బాటు మీ బడి పేరు, తరగతి తప్పక రాయండి. సరైన సమాధానాలు పంపిన పిల్లల పేర్లను పదరంగం-7 తో పాటు ప్రచురించగలం.
నిర్వహణ: దేవి, కొత్తపల్లి బృందం.

1		2		3	
4			5		6
			7		
	8	9			
10				11	

ఆధారాలు:

అడ్డం:

1. మన దేశ జాతీయ గీతం (6)
4. జుట్టుని అల్లితే వచ్చేది (2)
7. ఎర్రని గింజలుండే పండు (3)
8. పసిడి (3)
10. అన్నీ (3)
11. ఆటలోనూ, పాటలోనూ ఉండేది (1)

నిలువు:

1. కన్నీళ్ళు ఇలా రాలతాయి (4)
2. పశువుల మేత (2)
3. నువ్వు-నేను కలిస్తే (2)
5. ఈ పువ్వు చివర దారం ఉంటుంది (3)
6. అమ్మకి అమ్మ (3)
8. జిగురు (2)
9. చేపల్ని పట్టడానికి వాడే సాధనం (2)

పదరంగం-3 కి సమాధానం



పొడుపు కథలు

సేకరణ: బి.రామచంద్ర, 3 వతరగతి, శ్రీమారుతి విద్యానికేతన్, చెన్నేకొత్తపల్లి,
కె.గౌరిప్రియ,7 వతరగతి,Z.P.హైస్కూల్, చెన్నేకొత్తపల్లి.

1. తొక్కితే చాలు-తొంభై ఆమడలు పోతుంది. ఏమిటది?

2. ఆకాశంలో అంబు-అంబులో చెంబు-
   చెంబులో చేరెడు నీళ్ళు, ఏమిటది?

3. దేహమంతా కన్నులే కాని దేవేంద్రుడు కాదు
   భుజము మీద ఉంటుంది కాని బుడత కాదు
   జీవంలేదు కానీ కదిలే జీవుల్ని పట్టి బంధిస్తుంది- ఏమిటది?

4. తెల్లని శరీరం-నల్లని టోపీ: ఏమిటది?

5. నూరు ఆవులు ఒక పేడకుప్ప పెట్టాయి: ఏమిటది?

6. తెల్లని పొలంలో నల్లని విత్తనాలు-
   చేత్తో వేస్తారు; నోటితో ఏరతారు: ఏమిటది?

7.ఆకాశంలో ఎగురుతుంది కాని పక్షి కాదు: ఏమిటది?

జవాబులు

1. సైకిల్.
2. మేఘం.
3.వల
4. అగ్గిపుల్ల.
5.తేనెపెట్టె.
6.పుస్తకం.
7. గాలిపటం.

బొమ్మకు కథ రాయండి!

నిర్వహణ: శ్రీమతి జి.లలిత, telugu4kids.com

ఈ బొమ్మను చూడండి.. దీన్ని చూస్తే మీకేమనిపిస్తున్నది?

కోతి, పాపం అలిసిపోయినట్లున్నది.
వేరే చోటేమీ దొరకలేదో, ఏమో-
చెట్టు కాండం మీదే నిద్రపోతోంది.
లేకపోతే దానికి ఏడుపు వస్తున్నదేమో-
చెట్టు కొమ్మను చేతిలో పట్టుకొని,
కళ్ళు తుడుచుకుంటున్నదేమో.
మరి ఇది కోతి శాస్త్రవేత్త కావచ్చు:
ఏదైనా పరిశోధన చేస్తున్నదేమో-
విరిగిన వేపపుల్లలోంచి చూస్తే
ఈ ప్రపంచం వేరేగా కనబడుతుందేమో..

బహుశ: ఇక్కడేదో కథ దాక్కొని ఉండచ్చు! మాకు తెలుసు, మీకు తెలుసని! మీరు కనుక్కున్న ఆ కథని రాసి పంపించండి మాకు. అది బాగుంటే దాన్నే అచ్చువేస్తాం, రెండు నెలల తర్వాత.

మా చిరునామా: కొత్తపల్లి, యంఆర్వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా- 515101
ఫోను: 08559 240495 ఇ-మెయిలు: team@kottapalli.in

చిలిపి ప్రశ్నలు-తిక్క జవాబులు

సేకరణ: శ్రీవివియస్‌మూర్తి, చొదిమెళ్ళ, పశ్చిమగోదావరిజిల్లా

1.ధన వంతుల అబ్బాయికి ట్యూషన్ చెప్పే మాస్టారు తలపట్టుకునేదెప్పుడు!?

వాడికి ఎన్నిసార్లు 'ఎ,బి,సి,డి....' లు నేర్పినా 'ఎ,సి' మాత్రమే రాస్తున్నప్పుడు!!

2. దంతవైద్యుడు చాక్లెట్ ఫాక్టరీ పెడితే....!?

"చాక్లెట్ తినటం పళ్ళకు హానికరం "అని ప్రతి చాక్లెట్ మీదా ప్రింట్ చేస్తాడు!!

3. మౌనవ్రతం ఎక్కడ విజయవంతం అవుతుంది!?

లైబ్రరీలో

4. డబ్బింగ్ ఆర్టిస్ట్ తల్లి అయి ఏం చేస్తుంది!?

రికార్డు చేసిన జోలపాటకు పెదిమలు కదిలిస్తూ పిల్లాణ్ణి నిద్రపుచ్చుతుంది.

5. తండ్రి తలపట్టుకునేదెప్పుడు!?

"లెక్కల్లో సున్నా వచ్చిందేంట్రా" అని కొడుకును అడిగితే "సున్నాని కనిపెట్టింది మన భారతీయులే నాన్నా" అని కొడుకు గర్వంగా చెప్పినప్పుడు!

6. ఆర్.టి.సి కి లాభాలు తెప్పించమంటే తెలివైన కండక్టరు ఏం చేశాడు!?

లావుగా వున్న ప్రయాణీకుల్ని ఒకటిన్నర టికెట్ తీసుకోమన్నాడు!

7. విమానప్రయాణాల్లో విడ్డూరం ఏంటి!?

విమానాల్లో తీసుకెళ్ళే లగేజికి లిమిట్ ఉంటుంది; కానీ ప్రయాణీకుల బరువుకి మాత్రం ఏలాంటి పరిమితీ ఉండదు!

8. మేనేజర్ అయోమయంలో పడేదెప్పుడు!?

"నాకు చెడ్డపేరు తెచ్చుకునయినా సరే మీకు మాత్రం మంచి పేరు తెస్తాను సార్" అని అసిస్టెంట్ మేనేజర్ అన్నప్పుడు!

సమీక్ష

ప్రతి మాసమూ మరికొన్ని కథల్ని మోసుకొచ్చే కొత్తపల్లి మరీ పలచన అయితే అయిపోవట్లేదు గద? తెలిసో తెలీకో చాలా తప్పులేమీ చేయట్లేదు గద? కొత్తపల్లి వెలువడగానే ప్రతినెలా స్వతంత్రంగా సమీక్షించి పెట్టమని మాలతిగారిని అడిగాం. వారి సమీక్షా వ్యాసాలలో ఇది రెండవది.

నిర్వహణ: శ్రీమతి వై.మాలతి, విద్యార్థి సృజన కుటీర్, విజయవాడ.

'అయ్యో, తెలుగు రాదే!', 'నీతిచంద్రిక', 'ధర్మ సంకటం', సుచరిత సేకరించిన 'జోకులు',..ఈ నెల పుస్తకంలో హైలైట్‌లు- అదేవరసలో.

వెనక అట్ట పేజీలోని 'అయ్యో! తెలుగు రాదే!' లోని సంభాషణ ఎంత సుపరిచితంగా అనిపించిందంటే, ప్రతి ఒక్కరం ఆ మాట్లాడుకున్న ఇద్దరు వ్యక్తులలో తప్పకుండా ఎవరో ఒకళ్ళమై ఉంటామేమో! "పాపం! ఇంగ్లీషులో అచ్చేయకపోయారూ!" అని బామ్మగారు జాలిపడిన తీరు చమత్కారంగా నవ్విస్తూనే చురకలు కూడా పెట్టింది.

నీతిచంద్రిక కథనం ఈసారి పదునుగా, చురుకుగా కదం తొక్కింది. ముఖ్యంగా సింహానికీ, సంజీవకుడికీ మధ్య జరిగిన భీకర యుద్ధాన్ని కళ్ళకు కట్టినట్టు, రోమాంచితంగా వర్ణించటంలో రచయిత నూటికి నూరు మార్కులు కొట్టేశారు.

సంఘటనల పట్ల గంభీరమైన ఆలోచన చెయ్యకుండా, అప్పటికప్పుడు, ఎలాతోస్తే అలా

స్పందించే వ్యక్తుల పొగడ్తల్నీ, విమర్శల్నీ ఎలా తీసుకోవాలో పర్తాప్ అగర్వాల్ గారు లోతుగా, బలంగా చెప్పారు. నారాయణ గారి అనువాదం బాగుంది, కానీ కథ చివరలోని గాంభీర్యం పిల్లల స్థాయికి అందదేమో అనిపించింది. మాతృకలో లేకపోయినా, ఉదాహరణలతోగానీ, వివరణతో గానీ చెప్పి ఉంటే బాగుండేదేమో.

జోకులు ఎప్పటికంటే బాగా, హాయిగా నవ్వుకునేలా ఉన్నాయి. కీపిటప్ సుచరితా!

పిల్లల జీవితంలో చదువుకున్న విలువ ఈసారి 'థీమ్ ఆఫ్ ది బుక్' లాగా అనిపించింది. బళ్ళు తెరుస్తున్న నేపథ్యమో, మరి కాకతాళీయమోగాని, ఎక్కువ కథలు ఈ అంశం చుట్టూనే అల్లబడ్డాయి.

నిర్మలాబాయి వ్రాసిన ఐక్యత చదివితే "ఎవరో ఒకరు..ఎప్పుడో అప్పుడు- నడవరా ముందుగా.. అటో, ఇటో, ఎటో వైపు.." అనే మంచి పాట గుర్తుకు వచ్చింది. శైలి బావుంది.

'కుందేలు-తాబేలు' పవన్ చక్కగా వ్రాశాడు. తాబేలు పాత్రని పెద్దగా వర్ణించకుండానే గొప్పగా చిత్రీకరించాడు. ప్రతీకారభావం లేకపోవటం బావుంది.

బడి-పిల్లలు-ప్రకృతి- మూడింటినీ ఎంత అందంగా, ఆప్యాయంగా కలిపారు వెంకట్రావుగారు! రంగుల పువ్వులు పాటని పిల్లల మనసుల్లో పరకాయ ప్రవేశం చేసి వ్రాశారాయన.

ఇక 'జేజిమామయ్య' రజనీ గారిగురించి చెప్పేంత అర్హత, అనుభవం ఐతే లేవుగానీ, అతి తేలికైన పదాలతో అంత లయబద్ధంగా ఆడుకున్న ఆయన మేధస్సుకీ,ప్రతిభకీ అబ్బురపడటం మాత్రం తప్పదు. 'యక్షగానం, శతపత్ర సుందరి' వంటివి రాసిన కలమేనా, క్వాక్ క్వాక్ అంటూ ఈ పాటని రాసింది?! జేజి మామయ్యకు జేజేలు!

ఇక చంద్రుడికీ మచ్చలున్నట్లు, ఈసారి కొత్తపల్లిలో ఎక్కువ కథలు చదివించటంలో కాస్త వెనకబడ్డట్లు అనిపించింది. బొమ్మల్లో కూడా భావం, జీవం ఇంకా బావుండాలనిపించింది. 54 వ పేజీలో ఇచ్చిన కార్టూన్లకు, ప్రక్కనే ఇచ్చిన ప్రశ్నలకు సంబంధం ఉందని డిజైనింగులో అనిపించలేదు! కార్టూన్లలోని అక్షరాలైతే మరీ చిన్నవిగా ఉన్నై. ఈసారి వీటిని సరి చేసుకోవాలి.

సుష్టుగా కథలు భోంచేసి వచ్చేశాం. మళ్ళీ విందు కోసం ఎదురు చూస్తుంటాం.

థాంక్యూ కొత్తపల్లీ!

వెల:
ప్రతి ఒక్కింటికి: 20 రూ.
12 పుస్తకాలకై చందా: 240 రూ.

"కొత్తపల్లి ట్రస్టు" పేరిట యంవో/డిడిని ఈ చిరునామాకు పంపండి: కొత్తపల్లి ట్రస్టు, యంఆర్‌వో ఆఫీసు దగ్గర, చెన్నేకొత్తపల్లి, అనంతపురం జిల్లా- 515101, ఆంధ్రప్రదేశ్.

బ్యాంకు అక్కౌంటు వివరాలు:
"Kottapalli Trust",
A/c No. 0138101018809 (savings), Canara Bank, Chennekothapalli. IFSC: CNRB0000138

ఫోన్లు: 08559 240222, 7702877670
ఇ-మెయిలు: team@kottapalli.in

ఈ నెలలో ఏపని-ఎవరిది?

ఆర్థిక వ్యవహారాలు, నిర్వహణ: సుబ్బరాజు
సంపాదకత్వం: నారాయణ
వెబ్సైటు, సమాచార సాంకేతికత: ఆనంద్
ముద్రణ: 'ముద్రిక' కృపాకరరావు
చిత్రాలు: అడవిరాముడు, శివ, వాసు, మహేష్, వెంకట్.
చిలిపి ప్రశ్నలు: వివియస్ మూర్తి.
బొమ్మకు కథ: జి.లలిత, telugu4kids
సమీక్ష: వై.మాలతి.
కథలు, పాటలు: చాలామంది పిల్లలు

ప్రత్యేక కృతజ్ఞతలు:
కార్టూన్ల వివియస్ మూర్తిగారికి, ప్రకృతి బడికి, టింబక్టు బడికి, అరవింద స్కూలుకు, విద్యార్థి సృజన కుటీరానికి, నందన గ్రామీణ పాఠశాలకు, వెంకటేశ్వర బాలకుటీరానికి, telugu4kidsవారికి, మాలతీ కృష్ణగార్లకి, ఇంకా పేర్లు రాయని అనేకమందికి.

ఇంటర్నెట్‌లో http://kottapalli.in వద్ద కొత్తపల్లి పత్రికను చదవండి.

అందరు పిల్లల కోసం మీరూ కథలు రాసి పంపండి.

చందాదారులుగా చేరి నెల నెలా కొత్తపల్లిని పోస్టులో మీ ఇంటికి తెప్పించుకోండి.

మీ మిత్రుల తరపున చందాలు కట్టండి.

మీకిష్టమైన బడులకు, గ్రంథాలయాలకు కొత్తపల్లిని బహూకరించండి.

అయ్యో! తెలుగు రాదే, ఎలాగ?!

"కథలమ్మా కథలు! కథలమ్మా కథలు! రకరకాల కథలు! తెలుగుపిల్లల కథలు!"

"ఏం కథలు బాబూ? మా పిల్లలకు తెలుగు చదవటం రాదు. ఇంగ్లీషు కథలు ఏమన్నా ఉన్నాయా, నీ దగ్గర?"

"ఇంగ్లీషువైతే వేరేవాళ్ళ దగ్గర దొరుకుతాయండి. నా దగ్గర ఉన్న సరుకంతా తెలుగువాళ్లకోసమే. ఏం, మీ పిల్లలు తెలుగువాళ్ళు కారాండీ? పాపం, వాళ్ళకి కొంచెం తెలుగు నేర్పించకపోయారూ?"

"ఏమో నాయనా! మా వాళ్లకైతే ఇంగ్లీషు అంటేనే ఇష్టం. ఆ ఇంగ్లీషు నేర్చుకునేసరికే వాళ్ల తల ప్రాణం తోకకొచ్చింది. ఇంక తెలుగు ఎక్కడ నేర్చుకుంటారు?"

"అవున్లెండి, పాపం. కానీ నా దగ్గర ఉన్నవి తెలుగు కథలేనండి. మీకు పనికిరావు."

"ఏదీ, ఓసారి చూడనియ్యి- పుస్తకం బానే ఉన్నట్టుందయ్యా, కాయితం, రంగులు అదీనీ- దీన్ని పాపం ఇంగ్లీషులో అచ్చెయ్యకపోయారూ? మీకూ కొంచెం అమ్మకాలుండేవి గద! ఇప్పుడు పిల్లలంతా ఇంగ్లీషు బళ్లలో చదివీ చదివీ, తెలుగుని పూర్తిగా మరచే పోతున్నారుగా?"

"అవునండీ, అందుకనే వీటిని తెలుగులో మాత్రమే అచ్చేస్తున్నాం. మీ పిల్లలకి ఈ కథలు కావాలంటే వాళ్ళు తెలుగు నేర్చుకోవాల్సిందే, తప్పదు. లేకపోతే ఇంకో మార్గం ఉంది- మీరు వాళ్లకి చదివి పెట్టచ్చు-"

"అవున్లే, అట్లాగైనా వాళ్లకి మెల్లగా తెలుగు చదవటం వస్తుందేమో, చూస్తాను. కథలు చదవటం కోసమన్నా వాళ్ళు తెలుగు నేర్చుకుంటారేమో"

"తప్పకుండా నేర్చుకుంటారు చూడండి. అదేమంత బ్రహ్మవిద్య? తలచుకుంటే వాళ్ళు ఒక్కరోజులో నేర్చుకోగలరు. కథల్లో మాయ మీకు తెలీనిదా? మీరు చిన్నప్పుడు ఎన్ని కథల పుస్తకాలు చదవలేదు?"

"అవును నాయనా! ఇప్పుడు తెలుగు పుస్తకాలే కరువైపోతున్నాయి"

"ఏమీ లేదండీ! ఆదరించేవాళ్లు ఉంటే భాష చటుక్కున పుంజుకుంటుంది. ఏం చేసినా తెలుగులో అర్థమైనంత బాగా పరాయి భాషలో ఎంతమందికి అర్థమౌతుంది, చెప్పండి? ఏదో ఒక మాయ చెయ్యాల్సిందేనండీ. మీ పిల్లలకి 'తెలుగు రాదు' అని ఊరుకోకండి. ఏదో ఒకటి చేసి వాళ్ళ భాషని వాళ్ళకి ఇవ్వాలి- లేకపోతే కుదరదు."

"అంతేనంటావా?"

"అంతేనండీ- వేరే మార్గం లేదు. మాతృభాష తర్వాతే, వేరే ఏదైనా"

Edited and Published by Narayana for Kottapalli Trust, Near M.R.O.Office, Chennekothapalli-515101, Ananthapur District, AP. Ph:08559 240222 E-mail: team@kottapalli.in

మంచి పుస్తకం:

తెల్లకాకి-మరిన్ని పిల్లల కథలు

పన్నెండేళ్ల పిల్లలకు జానపద కథలమీద ఉండే ప్రేమ వేరే వేటిమీద ఉంటుందో చెప్పటం కష్టం. "సుధామూర్తి మెచ్చిన తెల్లకాకి-మరిన్ని పిల్లల కథలు" అనే పొడవాటి పేరున్న ఈ పుస్తకం ఒక్కటుంటే చాలు- వాళ్లకు సంవత్సరానికి సరిపడా మేత దొరికినట్లే.

వివిధ దేశాల్లో చలామణీలో ఉన్న జానపద కథల్లోకి భారతీయతను జొప్పించి, సందర్భాలనీ, పేర్లనీ, బొమ్మల్నీ అన్నిటినీ మధ్యయుగంలోకి తర్జుమా చేసి, తెలివితేటలు, పరస్పర మోసాలు, పాటవ ప్రదర్శనల మహా ప్రపంచాన్ని ఈ పుస్తకం అలవోకగా ఆవిష్కరిస్తుంది. పూర్వజన్మలో తానొక మైనా పిట్ట అనుకునే రాకుమారి, రాజులు-పేదలు, దాతలు-లోభులు, వింత వ్యక్తులు-తమాషా మనుషులు అందరూ ఈ కథల్లో తారసపడతారు నిజంగానే.

ఆ ప్రపంచంలో ఆరో తరగతి పిల్లలు మైమరచి పోతారు. ఏడో తరగతి పిల్లలు ముగ్ధులై, నిశ్చేష్టులై నిలబడిపోతారు. ఎనిమిది, తొమ్మిది తరగతుల పిల్లలు తమవైన ఊహాలోకాలను సృష్టించేసుకుంటారు ఇష్టంగా.

సుధామూర్తిగారి ఈ కథల్ని తెలుగులోకి అనువదించిన "ద్వారకా" గారి శైలి ఇంకొంచెం ఆధునికంగా ఉంటే బాగుండేదేమో అనిపిస్తుంది. అయినా పెద్ద పెద్ద పేజీలు, ప్రతి కథ మొదట్లోనూ సందర్భానికి తగిన సరళమైన బొమ్మలు, పెద్ద అక్షరాలు- మొత్తం మీద ఈ పుస్తకం పిల్లలందరికీ నచ్చుతుందనటంలో సందేహం లేదు.

తెల్లకాకి-మరిన్ని పిల్లల కథలు

అలకనంద ప్రచురణలు,

విజయవాడ-8

162 పేజీలు, వెల 125 రూపాయలు.